నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
వరంగల్
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com
1

ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్ ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సకాలం లో పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖేడే, సంధ్యారాణిలతో కలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (86) దరఖాస్తులు రాగా 56 రెవెన్యూ, 30ఇతరశాఖలకు చెందినవి ఉన్నాయని, ఆయా దరఖాస్తులను సంబంధి త శాఖ అధికారులకు పరిష్కారం నిమిత్తం సిఫారసు చేశారు. ప్రభుత్వ అభివద్ధి సంక్షేమ పథకాలు అర్హులకు చేరేవిధంగా జిల్లా అధికారులు చొరవ చూపాలని, ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులు పరిష్కరించేందుకు వీలుకానీపక్షంలో అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ ప్రజావాణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులను సూచించారు. ప్రజావాణిలో నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, జెడ్పీ సీఈవో రాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ బారిపై చర్యలు తీసుకోవాలి

- సీపీని కలిసిన జర్నలిస్టు యూనియన్ నాయకులు



నవతెలంగాణ-వరంగల్

డీసీపీ బారిపై చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ డాక్టర్ అంబర్‌కిషోర్‌ఝాను జర్నలిస్టు యూనియన్‌ల నాయకులు కోరారు. ఎస్ఎస్ఎం క్లబ్ వద్ద అభివద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పలు మంత్రుల కార్యక్రమంలో తూర్పు జర్నలిస్టులను పరుష పదజాలంతో దూషించిన వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి బారిపై చర్యలు తీసుకోవాలంటూ సీపీ కార్యాలయంలో ప్రెస్ క్లబ్ బాధ్యులు, పలు జర్నలిస్టులు సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. వరంగల్ నుండి హనుమకొండ ప్రెస్‌క్లబ్‌కి భారీగా తరలివెళ్ళిన తూర్పు జర్నలిస్ట్ లు,ప్రెస్ క్లబ్ సభ్యులు, నల్ల బ్యాడ్జిలతో డిసిపి బారికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జర్నలిస్టులకు బహిరంగంగా క్షమా పణ చెప్పాలని నిరసన తెలిపి సీపీ అంబర్ కిషోర్ కి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో టియూ డబ్ల్యూ జే (ఐజేయు) అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం రాంచందర్, మట్టా దుర్గా ప్రసాద్, యూనియన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు మిద్దెల రంగనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాడిపెల్లి మధు, ఐజేయు హన్మకొండ జిల్లా ప్రధనకార్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ ఆడెపు సాగర్ టియుడబ్ల్యూజే (143) రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్.లెనిన్, జిల్లా అధ్యక్షుడు కక్కెర్ల అనిల్, టీడబ్ల్యూజెఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు టివి రాజు, టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల సురేందర్, పిన్నా శివకుమార్, గడ్డం కేశవమూర్తి, తుమ్మ శ్రీధర్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు,బొల్లారపు సదయ్య, బోళ్లఅమర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

సీపీని మర్యాపూర్వకంగా కలిసిన వరంగల్ ఏసీపీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



వరంగల్ డివిజనల్ నూతన ఏసీపీ గా బాధ్యతలు చేపట్టిన నందిరాంనాయక్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మార్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనరరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లు, ఇతర విభాగాలకు నూతన ఇన్‌స్పెక్టర్లు బాధ్యతలు చేపట్టిన ఇన్స్ స్పెక్టర్లు సోమవారం సీపీని మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కలను అందజేశారు. పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కల్సిన వారిలో శ్రీధర్, కిషన్, శివకుమార్, రమేష్, సువర్ణ, రవికుమార్, పవన్ కుమార్, రాజు,క్రాంతికుమార్, నాగబాబు, సూర్యప్రసాద్, సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

గురువయ్య ఆశయ సాధనకు కృషి చేస్తాం

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు

నవతెలంగాణ-దుగ్గొండి



సమసమాజ స్థాపన ధ్యేయంగా ఎర్రజెండా బాటలో తుదిశ్వాస వరకు పయనించిన బీరం గురువయ్య ఆశయాలను సాధిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఈసంపల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి అన్నారు. ఆదివారం రాత్రి వయోభారం, అనారోగ్యంతో మరణించిన తిమ్మంపేట పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు సీనియర్ సిపిఎం నాయకుడు బీరం గురువయ్య మతదేహాన్ని సోమవారం సందర్శించి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువయ్య మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకుపోవడమే వారికి అర్పించే నిజమైన నివాళి అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమకొండ శ్రీధర్, మండల కమిటీ సభ్యులు అక్కపెల్లి సుధాకర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి, నల్గొండ మొగిలి, గొర్రె సంజీవరెడ్డి, గిన్నె సాంబయ్యలు పాల్గొన్నారు.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ లేకుండా భర్తీ చేయాలి

నవతెలంగాణ-వరంగల్



గురుకుల బోర్డ్ ఇచ్చిన 9210 ఉద్యోగాలను ఎలాంటి బ్యాక్‌లాగ్ లేకుండా అన్ని ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీచేయాలని ఆమర్లపొడి ఆనంద్ అన్నారు. అధ్యాపకులు అశోక్ చేస్తున్న నిరాహార దీక్షకి మద్దతుగా రాష్ట్రంలోని నిరుద్యోగులు వారి ఇళ్లలోనే నిరాహార దీక్షకు పూనుకున్నామని తెలిపారు. ప్రభుత్వ తొందరపాటుతో 4 వేల కుటుంబాలు నష్టపోతు న్నాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లోని ఉద్యోగాలను మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఒక్క పోస్టు కూడా బ్యాక్‌లాగ్ లేకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం స్పందించే వరకు దీక్షను కొనసాగిస్తామని ఆయన అన్నారు.

కబ్జాదారుల నుండి భూములను ఇప్పించాలి

- గ్రీవెన్స్‌లో దౌలత్‌నగర్ దళితుల వినతి

నవతెలంగాణ-పర్వతగిరి

దళితులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతుల అభ్యున్నతి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం కేటాయించిన భూమిని పర్వతగిరికి చెందిన చింతపట్ల శ్రీనివాసరావు, సుభాషిణి, రమాదేవిలు ఆక్రమిం చుకున్నారని భూ ఆక్రమణదారులపై పూర్తిస్థాయిలో తక్షణమే విచారణ జరిపించి, కబ్జాకోరల్లో నుండి భూమిని రక్షించి తమ భూములు తమకు ఇప్పించాలని కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి మా 40మంది భూములను మాకు ఇప్పించి దళితులమైన మహిళ రైతులకు న్యాయం చేయాలని దౌలత్‌నగర్‌వాసులు విన్నవించారు. కానీ సమస్యపై దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్లిన దళిత మహిళా రైతులను జిల్లా కలెక్టర్ పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కలెక్టర్ ను వేడుకుంటున్నారు.



అభ్యర్థుల ఖరారుతో పోటీకి రంగం సిద్ధం

- నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ప్రధాన రాజకీయపార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. దీంతో రాజకీయ సమీకరణలు మారుతుండడంతోపాటు తాజాగా ఎన్నికల ప్రచారాన్నిసైతం ప్రారంభించాయి. సోమవారం భద్రాచలంలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను లక్షన్నర మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇప్పటికే బిఆర్ఎస్ నుండి ప్రస్తుత ఎంపి మాలోత్ కవిత, కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్ పేర్లు ఖరారయ్యాయి. తాజాగా బిఆర్ఎస్ నుండి మాజీ ఎంపి అజ్మీరా సీతారాంనాయక్ బిజెపిలో చేరిన విషయం విధితమే. బిజెపి అభ్యర్థిగా సీతారాంనాయక్ పేరు ఖరారవుతుందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. బిజెపి అభ్యర్థిత్వాన్ని ఆశించిన హుస్సేన్‌నాయక్‌కు ఎస్టీ జాతీయ కమిషన్ ఛైర్మన్ పదవిని ఇవ్వడంతో సీతారాంనాయక్‌కు లైన్ క్లియర్ అయ్యింది. అధికారికంగా ప్రకటన రావడమే తరువాయి అని బిజెపి వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారవడంతో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో గెలుపు వ్యూహంతో పార్టీలు ప్రచారాన్ని సైతం ముమ్మరం చేయనున్నాయి.





ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించడానికి తెరవెనుక పావులు కదుపుతుంది. ఇందులో భాగంగానే ఒక్కో నియోజకవర్గంలో కీలక నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటూ విపక్షాలను బలహీనపరుస్తూ తనదైన శైలిలో రాజకీయ సమీకరణలను త్వరితగతిన తమకనుకూలంగా మార్చుకుంటూ దూసుకుపోతుంది. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం భద్రాచలం నియోజకవర్గం మినహా మిగతా మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, డోర్నకల్, పినపాక, ఇల్లందు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలిచారు. దీంతో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించాలని భావిస్తుంది. ఖమ్మంతోపాటు మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాలకు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తుండడంతో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ఒక్కో నియోజకవర్గంపై ఫోకస్ చేసి కీలకమైన నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు.

తాజాగా డోర్నకల్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలతో అత్యంత రహస్యంగా చర్చలు జరపడంతో ఆ నేతలంతా కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.

- **మహబూబాబాద్‌లో ప్రచారం షురూ...**

బీఆర్ఎస్‌కు గడ్డుకాలం

బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ మాలోత్ కవిత తన గెలుపు కోసం ఎదురీత తప్పడం లేదు. కవిత సొంత నియోజకవర్గం డోర్నకల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్‌లోని కీలక నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా మాలోత్ కవిత, ఆమెతండ్రి మాజీ మంత్రి డిఎస్ రెడ్యానాయక్ మనోస్థైర్యాన్ని దెబ్బతీసి నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించడానికి పక్కా స్కెచ్‌తో కాంగ్రెస్ పావులు కదుపుతుంది. రెండు, మూడ్రోజుల్లో డోర్నకల్ నియోజకవర్గంలో కీలక పరిణామాలు జరగనున్నాయి. ఇప్పటి వరకు ఎదురులేదనుకున్న మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో కీలక పరిణామాలు సంభవించనున్నాయి.

'వేం', 'పొంగులేటి'కి ప్రతిష్టాత్మకం

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడం రాష్ట్ర ప్రభుత్వ సలహదారు వేం నరేందర్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రతిష్టాత్మకంగా మారింది. 'పొంగులేటి'కి డోర్నకల్ నియోజకవర్గంలోని మాజీ ఎంపి, సీనియర్ కాంగ్రెస్‌నేత రామసహాయం సురేందర్‌రెడ్డి (ఆర్ఎస్)కి సమీప బంధువు. దీంతో ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లోని కీలక నేతలందరినీ పార్లమెంటు ఎన్నికల లోపే కాంగ్రెస్‌లో చేర్చుకునే కార్యక్రమం ఊపందుకుంది. ఆర్ఎస్‌కు మేనల్లుడైన నూకల నరేష్‌రెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. 'నూకల' తన వర్గంతోపాటు తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఇదిలావుంటే వేం నరేందర్‌రెడ్డి సొంత నియోజకవర్గం మహబూబాబాద్ నియోజకవర్గం కావడంతో, ఈ నియోజకవర్గంలోనూ కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

బీజేపీ అభ్యర్థిగా సీతారాంనాయక్ ?

బిజెపి అభ్యర్థిగా మాజీ ఎంపి సీతారాంనాయక్ పేరు ఖరారవుతుందని ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఇక్కడ గత పార్లమెంటు ఎన్నికల్లో, తాజాగా మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపి నుండి పోటీ చేసి ఓడిపోయిన హుస్సేన్‌నాయక్ పార్లమెంటు టికెట్‌నాశించిన విషయం విధితమే. తాజాగా హుస్సేన్‌నాయక్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పదవిని ఇవ్వడంతో సీతారాంనాయక్‌కు లైన్ క్లియరైందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్వయంగా సీతారాంనాయక్ ఇంటికి వచ్చి ఆయన్ను బిజెపిలోకి ఆహ్వానించిన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీలో చేరడానికి నిర్ణయం తీసుకున్నారు.

ఈ విషయం తెలుసుకొని బీఆర్ఎస్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ స్వయంగా సీతారాంనాయక్‌ను కలిసి బుజ్జగించినా ఫలితం లేకపోయింది.

ఎట్టకేలకు బిజెపిలో చేరిన సీతారాం నాయక్‌కు ఆ పార్టీ టికెట్ ఇవ్వడానికి అంగీకరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక అధికారిక ప్రకటనే తరువాయి.

సమైక్యత నిదర్శనం ఫాతిమామాత ఉత్సవాలు





- ప్రతీ సంవత్సరం మార్చి నెలలో మూడు రోజుల ఉత్సవం..
- ప్రత్యేక ప్రార్థనలకు హాజరుకానున్న వేలాది మంది క్రైస్తవులు..
- గత 71 సంవత్సరాలుగా ఉత్సవాలు

నవతెలంగాణ-ఎన్‌జీవోస్ కాలనీ

కాజీపేటలోని ఫాతిమా మాత కేథిడ్రల్ చర్చి ఆవరణలో మార్చి నెలలో నిర్వహించే ఫాతిమామాత ఉత్సవాల్లో క్రైస్తవులతోపాటు ఇతర కులస్తులు సందర్శించడంతో సమైక్యతకు నిదర్శనంగా నిలుస్తుంది. ప్రతి సంవత్సరం మూడు రోజులపాటు నిర్వహించే ఈ మహోత్సవం ఫాతిమా మాత తిరునాళ్ల ఉత్సవంగా నామకరణం చేసి మూడు రోజుల పాటు నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో కాజీపేట ఫాతిమా ఫీస్ట్ కు ప్రత్యేకత సంతరించుకుంది. కులమతాలకు అతీతంగా ప్రతీఒక్కరు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. జిల్లాలోని ఉత్తర దక్షిణ భారత లను కలుపుతూ ప్రత్యేకత చాటుకున్న కాజీపేట జంక్షన్‌కు అనుకొని ఉన్న ఫాతిమానగర్‌లో గల ఫాతిమామాత క్షేత్రడల్ చర్చిలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఫాతిమామాత తిరునాళ్ల ఉత్సవం కోసం ప్రతీఒక్కరు ఎదురు చూస్తూ ఉండడం ఆనవాయితీగా వస్తుంది. ప్రజలు కోరుకున్న కోర్కెలు తీర్చుతూ అవరోధాలను దూరం చేస్తూ ఈ స్థలం చరిత్ర సష్టించింది. ఉత్సవాలలో పాల్గొనడానికి 12 జిల్లాల నుండి ప్రజలు భారీ సంఖ్యలో చేరుకుంటారు. క్రీస్తుశకం 1949లో నాటి హైదరాబాద్ మెనీగ్నోర్ అల్ఫోన్సాబెరట జిల్లాలో మెత్రాసనాన్ని ఏర్పాటు చేసేందుకు 71 ఎకరాలు కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి కోరగా అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో బెరాట పోర్చుగీస్ దేశం నుంచి ఫాతిమా మాత స్వరూపాన్ని హైదరాబాదుకు 1950 మే నెలలో తీసుకువచ్చి ఈ స్థలం కొనుగోలు చేశారు. మేత్రాసాన భవన నిర్మాణానికి ఏర్పడిన అవరోధాలను ఆటంకాలను దూరం చేసేందుకు స్వరూపం వద్ద విజ్ఞాపన చేయగా సమస్యలన్నీ దూరమై మేత్రాసనం చర్చ్ నిర్మించబడింది. దీంతో 1951లో జనవరి 4న పీఠాధిపతులు నిలయానికి శంకుస్థాపన చేయగలిగారు. అందుకు కృతజ్ఞతగా బిషప్ బెరేట అనుమతితో బ్రదర్ సాల నగరంలోని ఈ ప్రాంతానికి ఫాతిమానగర్ నామకరణం చేశారు. నాటి నుంచినేటి వరకు కాజీపేటలోని ఈ ప్రాంతానికి ఫాతిమానగర్‌గా పిలువబడుతుంది. ఫాతిమా మాత పేరుమీద ఏర్పాటు చేయబడ్డ చర్చి నిర్మాణం కోసం ములుగు ప్రాంతం నుంచి ప్రత్యేక రాతిని తెప్పించి ఐదున్నర సంవత్సరాలు నిర్విరామంగా కృషిచేసి ఫాతిమానగర్‌లో అపూర్వ చారిత్రాత్మక కట్టడాలను నిర్మించారు. 1962 మార్చ్ 13న క్రైథిడ్రల్ దేవాలయాన్ని బిషప్ బేరట ఆశీర్వాదంతో నాటి నుంచి ఫాతిమామాత ఉత్సవాలను మే 12, 13,14 తేదీల్లో నిర్వహించే వారు రాను రాను ప్రస్తుతం గత కొద్ది సంవత్సరాల నుంచి మార్చి 11,12,13 తేదీలో నిర్వహిస్తున్నారు.

2024 సంవత్సరానికి గాను ఫాతిమా మాత తిరునాళ్ల మహోత్సవం నిర్వహించేందుకు వరంగల్ పీఠాధిపతి ఉడుముల బాల ప్రతిపాదన సిద్ధం చేసి ప్రతి సంవత్సరం లాగే ఆంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలుతీర్చే ఫాతిమా మాతగా పేరుపొందిన ఫాతిమా మాత ఉత్సవాలకు ప్రజల అధిక సంఖ్యలో విచ్చేసి తలనీలాలు సమర్పిస్తారు. ఫాతిమా మాత విగ్రహంఎదుట క్యాండిల్ వెలిగించి కోరికలు నెరవేరాలని సమస్యలు తొలగిపోవాలని కోరుకుంటారు. 2024 సంవత్సరానికి గాను మూడు రోజులపాటు నిర్వహించే ఫాతిమ మాత ఉత్సవాలు నేడు ఫాతిమా మాత స్వరూపాన్ని ప్రత్యేక రథంపై పురవీధుల్లో ఊరేగించనున్నారు, అనంతరం రాత్రి చర్చి ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రార్థనలు ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. అలాగే భక్తుల కొరకు సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్య ప్రదర్శనలతో పాటు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు, ఉత్సవాలలో ప్రత్యేకంగా 25, 50 సంవత్సరాలు దాంపత్య జీవితాన్ని పూర్తి చేసుకున్న దంపతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్చి కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

బల్దియాలో ప్రజావాణికి 58 వినతులు

నవతెలంగాణ-వరంగల్



వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం సమావేశం మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక మాన్ని పురస్కరించుకొని సోమవారం అదనపు కమీషనర్ అనిసుర్ రషీద్, వివి ధ విభాగాల ఉన్నతాధికారులు హాజరై ప్రజల నుండి దరఖాస్తులను స్వీ కరించిపరిష్కార నిమిత్తం ఆయావిభాగాల అధికారు లకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు వి భాగాల వారిగా 17 ఇంజనీరింగ్, 8 హెల్త్, సానిటేషన్, 11 ప్రాపర్టీ టా క్స్ (రెవెన్యూ), 22 టౌన్ ప్లానింగ్‌లకు గాను మొత్తం 58 వినతులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో సిటీప్లానర్ వెంకన్న, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సెక్రెటరీ విజయ లక్ష్మి, హెచ్ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, డీసీపీ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావుపై కేసు నమోదు చేయాలి

- రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎ.వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-పర్వతగిరి



మండలం లోని కల్లెడ గ్రామానికి చెందిన రైతు బొంపెల్లి చెన్నారావు పై ఈనెల 4న దాడి చేయించిన ఎర్రబెల్లి రామ్మోహన్‌రావుపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వరంగల్ రైతుసంఘం జిల్లా కన్వీనర్ ఎన్నమనేని వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2016లో ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు కు సంబంధిత రైతు చెన్నారావు 20గుంటల భూమిని విక్రయించాడని, ఈ 20 గుంటల భూమి కల్లెడ బ్రిడ్జి కింద పోవడంతో రైతు చెన్నారావుకు మిగిలిన భూమిలో పం డించిన పంటలను ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు దౌర్జన్యంగా తీసుకెళ్లడం తో విధిలేని పరిస్థితుల్లో రైతు బొంపెల్లి చెన్నారావు కోర్టులో కేసు వేయ డంతో కోర్టు తీర్పు కూడా రైతు చెన్నారావుకే అనుకూలంగా రావడంతో రైతు చెన్నారావుపై కక్షపెంచుకున్న ఎర్రబెల్లి రామ్మోహన్ రావు కొంత మందితో పర్వతగిరి మండల కేంద్రంలో అల్లూరు సీతారామరాజు విగ్ర హం దగ్గర చెన్నారావుపై దాడి చేయించి హత్యాయత్నం చేయించిన రామ్మోహన్ రావు పై దాడి చేసిన వారిపై హత్య ప్రయత్నం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో రైతుసంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

12వ డివిజన్ పద్మశాలీ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-వరంగల్



12వ డివిజన్ పద్మశాలి నూతన కార్యవర్గాన్ని సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ వడ్నాల నరేందర్, వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆడెపు రవీందర్, కో-ఆర్డినేటర్ మాచబత్తుల కుమారస్వామి ఆధ్వర్యంలో ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కూరపాటి సంపత్, ఉపాధ్యక్షులుగా మేర్గు సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా బాసబత్తిని శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా లింగబత్తిని చంద్రశేఖర్, కోశాధికారిగా అడిగొప్పుల రామకృష్ణ, సహాయ కోశాధికారిగా యెలుగం రమేష్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా ఆనందం సదానందం, ఆకునూరి జయరాం, ముంద్రాతి అనిల్, సామల సుభద్ర, ఆడెపు శ్రీకల్పన ఎన్నికయ్యారు. ముఖ్యసలహాదారులుగా కూచన ఓదెలు, బూర రమేష్, కూచన సదానందం, బేతి రమేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన కూరపాటి సంపత్ ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మకూరు నూతన సీఐగా క్రాంతికుమార్

నవతెలంగాణ-ఆత్మకూరు



ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో సిఐగా కొనసాగుతున్న ఆర్.సంతోష్ బదిలీపై వీఆర్ వరంగల్ కు వెళ్లగా ఆయన స్థానంలో సీఎస్బీ వరంగల్ నుండి బదిలీపై అత్మకూర్‌వచ్చారు. నూతన సీఐగా క్రాంతి కుమార్ సోమ వారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు నాయకులు ప్రజలు సహకరించాలని, అసంఘటిత చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎవరు నిర్వహించిన సహించేది లేదని స్పష్టం చేశారు.

ఓ సిటీలో సమస్యలను పరిష్కరించండి

నవతెలంగాణ-కాశిబుగ్గ



వరంగల్ నగరం ఓసిటీలోని సమస్యలను పరిష్కరించాలని ఓసిటీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సోలేటి శ్రీధర్ రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, కూడా అధికారులకు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓసిటీలోని వీధి దీపాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, అండర్‌గ్రౌండ్ కేబుల్, మ్యాన్‌హోల్, పార్కుల అభివృద్ధి, తదితర సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్ శోభన్, సంజీవరావు, కూకట్ల సత్యనారాయణ, బోరుకొండ శ్రీనివాస్, రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గౌడసంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఖానాపురం



మండల కేంద్రంలో నూతన గౌడకుల సంఘ భవనానికి నిర్మాణానికి సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు శాఖమూరి హరిబాబు భూమి పూజ నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక నిధులనుండి గౌడ కులసంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యడ్ల భిక్షంరెడ్డి, మాజీ మండలపార్టీ అధ్యక్షులు వెంకటప్రసాద్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు లతో పాటు గౌడ కులస్తులు ఉన్నారు.

ఎస్‌బీఐ ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలు వెంటనే ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి
- ఎస్‌బీఐ నక్కలగుట్ట బ్రాంచ్‌ముందు సీపీఎం ధర్నా



నవతెలంగాణ-హన్మకొండ

ఎలక్ట్రోరల్ (ఎన్నికల) బాండ్లనురద్దు చేస్తూ వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలు సుప్రీంకోర్టుకు సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్‌బిఐకి గత నెలలో ఆదేశించిందని కాని కేంద్రంలోని బీజేపీ వత్తిడితో ఇప్పటివరకు ఎస్‌బిఐ సుప్రీంకోర్టుకు బాండ్ల వివరాలు సమర్పించకపోవడాన్ని నిరసిస్తూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు పార్టీ జిల్లా కమిటి ఆధ్వర్యంలో సోమవారం హన్మకొండ ఎస్.బి.ఐ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ ఎలక్ట్రోల్ బాండ్లు వసూలు చేయొద్దని ఇది రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం గతంలోనే చెప్పిందని అయినా బిజెపి ఎన్నికల్లో డబ్బుల పంపిణీ ఉపయోగించడం కోసం ఈ ఎలక్షన్ బాండ్లను తీసుకొచ్చిందని దీనిని వ్యతిరేకిస్తూ సిపిఎం సుప్రీంకోర్టులో కేసువేయగా ఎలక్ట్రోల్ బాండ్ రాజ్యాంగ విరుద్ధమని బాండ్ల వివరాలు ఈనెల 6 లోపు సుప్రీంకోర్టుకు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసిందని అయినా ఇంతవరకు ఎస్ బి ఐ ఇవ్వకపోవడాన్నిచూస్తే ఎస్‌బిఐ ప్రజల బ్యాంకుగా కాకుండా బీజేపీ బ్యాంకుగా వ్యవహరిస్తుందోనని మండిపడ్డారు. దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాల బేఖాతరు క్షమించరాని నేరమని అన్నారు. బీజేపీదేశం లోని అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకున్నట్లు ఎస్‌బీఐని కూడా తమ గుప్పెట్లో పెట్టుకున్నట్లు కనిపిస్తుందని అయన ఆరోపించారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్లు కార్పొరేట్ల వద్ద వసూళ్ల చేసిన బీజేపీ తన బండారం బయట పడుతుందన్న భయంతోనే వివరాలు వెల్లడించ కుండా ఎస్‌బిఐ చైర్మన్‌పై ఒత్తిడి చేస్తున్నట్టు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు టి.ఉప్పలయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, మంద సంపత్, కే.లింగయ్య, బి.భానునాయక్, కే. కుమార్, కిషోర్, డి.రాజేందర్, వి.రాజు, ఎం.రమా, సందీప్, స్రవంతి, కోమల, వినోద పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం : చల్లా



నవతెలంగాణ-ఆత్మకూరు

బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు చేయడంలో విఫలమయిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆత్మకూర్ టౌన్ పార్టీ అధ్యక్షులు పాపాని రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చి నేడు ఆ హామీలను అమలుచేయడం విస్మరించిందన్నా రు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటుతున్న ఇంకా ఏం అభివద్ధి పనులు చేయడం లేదని అన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో నీళ్ల లేక ప్రజలు ట్యాంకర్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కరువు వచ్చిందని అన్నారు. గత పది ఎండ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడు ఎలాంటి కరువు పరిస్థితి లేదన్నారు. ప్రజాపాలన అని హడావిడి చేశారే కానీ ఏనాడు ప్రజల సమస్యలు పరిష్కరించింది లేదన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, గూడెప్పహాడ్ ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి, దామెర మండల అధ్యక్షులు గండు రాము, మాజీ సర్పంచ్‌లు సాంబయ్య, మచ్చిక యాదగిరి, రంపీస మనోహర్, హర్షం బలరాం, బొల్ల నరేష్, మాదాసి అన్నపూర్ణ రాజు, కో-ఆప్షన్ నెంబర్ ఎండి.అంకుష్, నాయకులు మండల నత్తి కోరనల్, బాలకష్ణ, వేల్పుల గణేష్, రాజేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన అంటేనే కరువులు కష్టాలు

దామెర : కాంగ్రెస్ పాలన అంటేనే కరువులు కష్టాలు ఈ కరువు కాలం తెచ్చింది కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువు అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం దామెర మండలం ఓగులాపూర్ గ్రామంలోని గోపాల్ రావు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ మండల విస్తతస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివద్ధి పనులు చేసుకున్నాం కానీ నేడు ప్రస్తుత ఎమ్మెల్యేకి పరకాలలో అభివద్ధి కనిపిస్తలేదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, మండల పార్టీ అధ్యక్షుడు గండు రామకష్ణ, సొసైటీ చైర్మన్ బొల్లు రాజు , గరిగే కష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ముదిగొండ కష్ణమూర్తి, తదితర నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆలేటి లింగమూర్తి తల్లి ఆలేటి రామక్క అనారోగ్యంతో మతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం మతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ పరామర్శలో డి.శంకర్, గరిగే కష్ణమూర్తి, మెరుగు కుమారస్వామి, సంపత్, సంతోష్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

విద్యార్థులు శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రియేల్ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి సాధించగా సోమవారం పాఠశాలలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లాకలెక్టర్ ముఖ్యఅ తిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడు తూ విద్యార్థులు శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవడమే కాకుండా నిత్యజీవి తంలో కూడా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి శాస్త్రీయంగా ఆలోచించాలన్నారు. జేవీవీసంస్థ సమాజంలోని మూఢనమ్మకాల నిర్మూలనకు పాటుపడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో చెకుముకి టాలెంట్‌టెస్ట్ నిర్వహిస్తూ విద్యార్థులకు సైన్స్‌పట్ల ఆసక్తిని కలిగించడానికి చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు.

డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో హనుమకొండ జిల్లా నుండి సెయింట్ గాబ్రియేల్ పాఠశాల విద్యార్థులు ప్రథమబహుమతి సాధించినందులకు అభినందనలు తెలిపారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు బి.సాత్విక్ రెడ్డి, పి.నైద్రువ, వై.వరుణ్,గైడ్ టీచర్ ఎం.శిరీషలకు సర్టిఫికెట్ల ప్రదానంతోపాటు బహుమతులుగా టెలిస్కోపు, మైక్రో స్కోపులను కలెక్టర్ చేతుల మీదుగా సెయింట్ గాబ్రియేల్ స్కూ ల్ ప్రిన్సిపాల్ ఆంథోనీకి జన విజ్ఞాన వేదిక వారు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జేవీవీ చెకుముకి ఇంచార్జి నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పరికిపండ్ల వేణు, డాక్టర్ రాములు, కాజీపేట పురుషోత్తం, ప్రొఫెసర్ రామా రావు, ఉమామహేశ్వరరావు,శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన కేసీఆర్ కుటుంబం : ఎమ్మెల్యే జీఎస్ఆర్

నవతెలంగాణ-శాయంపేట

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో రూ.16,700 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉండగా కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి రూ.7 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. మండలంలోని గట్లకానీపర్తి గ్రామంలో సోమవారం రూ. 10 లక్షల నిధులతో చేపట్టనున్న శివాలయ ప్రహరి గోడ, కళ్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాయంపేట మండలానికి రూ.30 లక్షల నిధులతో అంబులెన్స్ అతి త్వరలో అందజేస్తానని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు పైపులైన్లు, మోటార్లు మరమ్మతు పనుల కోసం నిధులు కేటాయించాలని గుర్తు చేశారు. గాంధీనగర్లో 200ఎకరాలను ఆక్రమించుకోగా, ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆ ప్రాంతంలో 25 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలలో ఇప్పటికే నాలుగు పథకాలు అమలు



చేశామని, భద్రాచలంలో శ్రీరాముని సన్నిధిలో ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు. ఇచ్చిన మాటను కట్టుబడి ఉంటామని, నిజాయితీగా పని చేస్తామని, అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మాందారిపేట గుట్టలలో క్రషర్లు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, పేదల భూములను ఆక్రమించుకున్న వారి వెంటపడి పేదలకు స్థలాలు ఇప్పిస్తామని అన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ కాంగ్రెస్‌కుఅండగా ఉండాలన్నారు.

అభివద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

గోవిందపూర్ శివారులోని కేజీబీవీ గురుకుల పాఠశాలలో రూ. 13 లక్షలతో చేపట్టనున్న సివిల్ వర్క్స్, విద్యుత్ పనులు, వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్ శంకుస్థాపన చేశారు. కొత్తగట్టు సింగారం, తహరాపూర్ లో సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. కేజీబీవీ వద్ద బస్సులను నిలుపుదల చేయడం లేదని మహిళా ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లగా, భూపాలపల్లి, పరకాల డిపో మేనేజర్లతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడి రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేసి బస్సులను ఆపాలని ఆదేశించారు. కేజీబీవీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, నాయకులు నిమ్మల రమేష్, చిందం రవి, కుకిడి నాగేశ్వరరావు, వైనాల కుమారస్వామి పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా నాబార్డ్

- ఏజీఎం చంద్రశేఖర్




నవతెలంగాణ-భీమదేవరపల్లి

మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా నాబార్డ్ పనిచేస్తుందని ఆ సంస్థ ఏజీఎం చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ముల్కనూరులో గత 15 రోజులుగా మగ్గం వర్క్ శిక్షణ పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికెట్లు సోమవారం అందజేశారు. శిక్షణ పొందిన మహిళలు యూనిట్లు ఏర్పాటు చేసుకొని బ్యాంకు రుణం పొందాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబ వ్యవస్థ బాగుంటుందనేది నాబార్డ్ లక్ష్యమన్నారు. ఆసక్తిగల మహిళలకు మగ్గంవర్క్ శిక్షణ ఇచ్చేందుకు మరో బ్యాచ్‌కు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ నాగరాజు, స్పందన సేవా సొసైటీ సీఈవో హనుమండ్ల శోభారాణి, శిక్షకులు వాణి, సోనీ కో-ఆర్డినేటర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులను ఎంబీసీ జాబితాలో చేర్చాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



గంగపుత్రులను ఎంబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ కార్యాలయములో బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌ను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్య దర్శి టుంగుటూరి రాజేష్ రాజేష్ ఖన్నా విన్నవించారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ చేపల వేటే కులవృత్తిగా కొనసాగుతున్న సంప్రదాయ మత్స్యకార గంగపుత్రులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అత్యంత వెనుకబడి పేదరికంలో ఉన్నందున గంగపుత్రులను ఎంబీసీ అత్యంత వెనుకబడిన కులల జాబితాలో చేర్చాలని కోరారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

నవతెలంగాణ-శాయంపేట



భారత రాజ్యాంగాన్ని మార్చాలంటే 400 సీట్లు కావాలని కర్ణాటకకు చెందిన సీనియర్ బీజేపీ ఎంపీ ఆనంద్ కుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని బిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్ ఖండించారు. మండల కేంద్రంలో సోమవారం అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కర్ణాటక ఎంపీ అనంత్ కుమార్ హెగ్డే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నరేంద్ర మోదీ ప్రభుత్వానికి 400 సీట్లు వస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామని రాజ్యాంగంలో లౌకికం అనే పదాన్ని తీసివేస్తామని మాట్లాడడం ముమ్మాటికి నీచమైన దుశ్చర్య అని అన్నారు. బీజేపీ చేస్తున్న కుట్రను ఈ దేశంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క పౌరుడు కనిపెట్టి రానున్న పార్లమెంట్ ఎలక్షన్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు బొల్లపల్లి ప్రసాద్, శేషాద్రి తరుణ్, మొగ్గం నరేష్, నాలికే తరుణ్ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయించాలి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కషి చేస్తూ ఏనాడు పదవి ఆశించకుండా పార్టీ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించిన ఎంపీ ఆనంద్ కుమార్ సతీమణిగా ఉన్నత విద్యావంతురాలిగా సామాజిక సేవకురాలిగా గుర్తించి తనకు వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయించాలని ఎంపీ ఆస్పిరెంట్ సునీత ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం హనుమకొండ లోని సెయింట్ పాల్స్ స్కూల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీత ఆనంద్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు 35 శాతం రిజర్వేషన్ ఉన్నందున మహిళ కోట కింద తనకు టికెట్ కేటాహించాలి అని ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలను కోరుతున్న అన్నారు.

క్రిస్టియన్ ఫెలోషిప్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఉన్న తనకు టికెట్ కేటాయించడం ద్వారా వరంగల్ పార్లమెంట్ సీటును భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం హంటర్‌రోడ్ విశాల్ మార్ట్ సమీపంలో ఎస్ఐ రవికిరణ్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఒరిస్సాకు చెందిన లీమ జయరాజు, లీమరాజకుమారి అనే ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అనుమానం వచ్చి తనిఖీ చేయగా రూ.7,79,700 విలువైన 51.98 కిలోల ఎండు గంజాయి లభించగా వారి నుండి గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసికోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

17న జిల్లా స్థాయి చెస్‌పోటీలు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వరంగల్ జిల్లా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 17న హనుమకొండ లోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. అండర్-15 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 2009 జనవరి 1లోపు జన్మించిన వారు ఇందులో పాల్గొనవచ్చని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను ప్రశంసాపత్రాలను అందించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు నంబర్ 9059522986లో సంప్రదించాలని కన్నా తెలిపారు.

ప్రజాపాలన సేవ కేంద్రానికి విశేష స్పందన



నవతెలంగాణ-శాయంపేట

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాల అమలులో భాగంగా 4 గ్యారెంటీ పథకాల అమలు చేయడంతో దరఖాస్తు సవరణ కోసం జనం ఎగబడ్డారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఎంపీడీవో ఫణిచంద్ర ఏర్పాటు చేయగా, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 కే గ్యాస్ సిలిండర్ల పథకాల అమలులో భాగంగా ప్రజా పాలన దరఖాస్తులలో లబ్దిదారులు అసంపూర్తిగా దరఖాస్తు నింపడంతో పథకాలు అందడం లేదు. తప్పుల సవరణ కోసం అధికారులు సేవా కేంద్రంలో ప్రజలు పెద్దసంఖ్యలో దరఖాస్తులను సమర్పించి సవరణలు చేసుకున్నారు. పొరుగు గ్రామాల నుండి వచ్చిన మహిళలు కార్యాలయం వద్ద టిఫిన్ తింటూ ఉండడం సోమవారం 'నవతెలంగాణ' క్లిక్ మన్పించింది. తప్పుల సవరణకు సేవ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

అసత్య ప్రచారాలు చేయడం తగదు



నవతెలంగాణ-పర్వతగిరి

కల్లెడ ఆర్డీఎఫ్ వ్యవస్థాపకులు పలు ఆలయాల చైర్మన్ ఎర్రబెల్లి రామ్మోహన్ రావు పై వచ్చిన ఆరోపణలను గ్రామస్తులు సంపెల్లి వెంకటేశ్వర్లు, కొమరయ్య ఆధ్వర్యంలో స్థానికులు చిన్నపాక బాబు, తక్కల్లపల్లి దేవేందర్ సోమవారం ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకల్లెడ గ్రామానికి చెందిన బొంపెల్లి చెన్నారావు దంపతులు ఎర్రబెల్లి రామ్మోహన్ రావు పై చేస్తున్న ఆరోపణ లు సరైనవి కావని అన్నారు. కల్లెడ గ్రామ ప్రజలకు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు విద్యా సంస్థలను నెలకొల్పి అనేక ఆలయాలను పున ప్రతిష్టాపన చేసి గ్రామ అభివద్ధి కోసం అనేక ఆస్తులను డబ్బును ఖర్చుపెట్టిన రామ్మోహన్‌రావుపై అసత్యపు నిందలు వేయడం సరికాదన్నారు.

ఎస్సైని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-పర్వతగిరి



పర్వతగిరి పోలీస్ స్టేషన్‌నికి ఎస్సై గా నూతనంగా భాధ్యతలు చేపట్టిన గుగులోతు వెంకన్న ను సోమవారం ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్, ఎంఎస్పి జిల్లా కార్యదర్శి జిల్లా ధర్మయ్యలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

టిప్పర్ ఢీకొని కూలీలకు తీవ్రగాయాలు




నవతెలంగాణ-పరకాల

సిమెంట్ టిప్పర్ అతివేగంతో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టడంతో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం పరకాల పట్టణంలోని సీఎస్ఐ కాలనీకి చెందిన 17 మంది కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం రేగొండ మండలంలోని పోచంపల్లికి వెళ్లి 2 గంటల ప్రాంతంలో తిరిగి వస్తున్న క్రమంలో రూపురెడ్డి పల్లె మూలమలుపు వద్ద పరకాల మీదుగా భూపాలపల్లికి వెళుతున్న సిమెంట్ టిప్పర్ డ్రైవర్ అతివేగంగా కూలీల ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న కూలీలపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆటోను పైకి లేపి కూలీలను బయటకు తీసి పోలీసులకు ,108కు సమాచారం అందివ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బందికి పరకాల పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని వరంగల్ ఎంజిఎంకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ వారిలో బొచ్చు సాంబ, బొచ్చు ప్రమీల, బొచ్చు కొమరమ్మ సిఎస్ఐ కాల నీకి చెందిన ఉన్నట్లు గుర్తించారు.

కూలీలకు పరామర్శ

ఆటో ప్రమాదంలో గాయ పడిన వ్యవసాయ కూలీల ను బీ ఆర్ఎస్ నాయకులు మడికొండ శీను, మంద నరేష్, బొచ్చు రాజశేఖర్, దామోదర్ పరామర్శించి స్థానిక వైద్యులతో నాణ్యమైన వైద్య చికిత్సను అందించాలని కోరారు.

మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా వంగాల కళ్యాణి నియామకం



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా వరుసగా మూడు పర్యాయాలు గెలుపొందిన 6వ వార్డు కౌన్సిలర్ వంగాల కళ్యాణి మల్లారెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. సోమవారం జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ శాసన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు పీసీసీ సభ్యులు చెంచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని కళ్యాణి మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతను అప్పజెప్పిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

గత అంచనా ప్రకారమే సీసీ రోడ్డు నిర్మించాలి

- సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

గత అంచనా ప్రకారమే సీసీ రోడ్డు నిర్మించాలని సీపీఎం చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని క్రిష్టాజీగూడెం గ్రామంలో 3వ వార్డులోని ప్రజలతో కలిసి వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 3వ వార్డు నుండి చక్రితండా వరకు రోడ్డు నిర్మాణం చేయుటకు పంచాయతీరాజ్ శాఖ నుండి గత రెండేండ్ల కిందట మంజూరీ కాగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్య కారణంతో ఆలస్యం అవుతుందని, సత్వరమే నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తి చేయాలని, స్వార్థ పూరిత రాజకీయాలను పక్కనబెట్టి అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూలమాటి శ్రీధర్, ఆవుల నరేష్, మొగులగోని శ్రీనివాస్, సాదం రాజమ్మ, ఉద్దేమారి వజ్రమ్మ, సాదం లక్ష్మి, ఆకునూరి ప్రమీల, సాదం చేరాలు, సాదం ఐలమ్మ పాల్గొన్నారు.



ఉచిత చేప రొయ్య పిల్లలకు సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

నవతెలంగాణ-జనగామ

ప్రభుత్వం అందించనున్న ఉచిత చేప రొయ్య పిల్లలకు సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని తెలంగాణ మత్యకారులు, మత్స్యకార్మిక సంఘంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత కార్యకర్తల సమావేశం సోమవారం జనగామలోని విజయ ఫంక్షన్ హాల్‌లో టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువులో ఎండిపోయిన చెరువులు కుంటలకు లీజులు రద్దు చేయాలని, 2024 సంవత్సరంలో ఉచిత చేప రొయ్య పిల్లలకు సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని కోరారు. గతపదిసంవత్సరాలుగా టెండర్లు పంపిణీలో జరుగుతున్న అవినీతిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మత్స్యపరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమానికి నూతన కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్య శాఖ మంత్రిని నియమించాలని కోరారు. 33 జిల్లాలకు వెంటనే జిల్లా మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఎన్నికలు జరిపి రాష్ట్ర పెడరేషన్ ఎన్నికలు జరపాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మునిగెల రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చనమోని శంకర్, కొప్పు పద్మ, ముఠా విజయ్ కుమార్, పగడాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు గొడుగు వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వాడపల్లి రాజు, దర్గయ్య, సత్యనారాయణ, దుర్గయ్య, బక్కి బాలమణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ పట్టణంతో పాటు జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో సోమవారం హైదరాబాద్‌కు చెందిన టాస్కోర్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి ప్రభాకర్ తనిఖీలు నిర్వహించారు. బంకుల్లో ఉండవలసిన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. పెట్రోల్ బంకుల యాజమాన్యం సి-ఫారం నింపి ప్రతినెల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమర్పించడం లేదని గుర్తించారు. లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులుతో కలిసి కొలతలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజా రాణి, డిటి శ్రీనివాస్, దేవా, ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ జంగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నూకల బాల్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-బచ్చన్నపేట

భవిష్యత్తును ఆలోచించి యువతకు అధిక సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని కిసాన్ స్టేట్ కౌన్సిలర్ నిడిగొండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన నూతనంగా ఎన్నికైన మండలాధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డిని గ్రామాధ్యక్షులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కి పూర్తి స్థాయి మెజార్టీ ఇచ్చి మన రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ఫలాలను పార్టీలకతీతంగా వినియోగించుకోవాలని కోరారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైన నూకల బాల్‌రెడ్డిని మండలంలోని పోచన్నపేట గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆకివీడు శ్రీధర్ ఘనంగా సన్మానించారు. బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా నియమితమైన నూకల బాల్‌రెడ్డిని బచ్చన్నపేట పట్టణాధ్యక్షుడు కోడూరి మహాత్మ చారి శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరు ప్రతాపరెడ్డి మండల ఇన్చార్జిగా నూకల బాల్‌రెడ్డిని నియమించడంతో సంతోషం వ్యక్తం చేస్తూ అలాగే గ్రామ శాఖ అధ్యక్షులను నియమించడం పట్టణ అధ్యక్షుడిగా నాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ స్టేట్ కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కర్రె నరేష్, పట్టణ ఉపాధ్యక్షుడు గంధమల్ల కిష్టయ్య, మాజీ మండల ఉపాధ్యక్షుడు దాచేపల్లి రాజయ్య, మాజీ పట్టణ ఉపాధ్యక్షుడు అల్వాల రమేష్, బందారం క్రాంతి, బండ నాగారం గ్రామ శాఖ అధ్యక్షులు ఇప్ప శ్రీధర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు స్వామి, రాగిశెట్టి అబ్బ సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి : హెచ్‌ఎం



నవతెలంగాణ-పాలకుర్తి

విద్యార్థినీ, విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని పాలకుర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి సూచించారు. సోమవారం మండల కేంద్ర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటల్ సైన్స్ ఫెస్ట్ నిర్వహణ కార్యక్రమంలో భాగంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో రూపొందించిన పలుప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. 25 మంది విద్యార్థిని విద్యార్థులు మూడు రోజులుగా కార్యాశాలలో పాల్గొని రూపొందించిన 15 ఎగ్జిబిషన్ ప్రాజెక్టులను సందర్శించి విద్యార్థిని విద్యార్థుల కృషిని అభినందించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థిని విద్యార్థులకు దోహదపడుతుందని తెలిపారు. ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలలో విద్యార్థుల ప్రాజెక్టులు ఆవిష్కరణలుగా మారడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫెస్ట్ ఇన్చార్జి చిలకాని అశోక్, మండల నోడల్ ఆఫీసర్ పోతుగంటి నర్సయ్య, ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్ ఏ. నరసింహమూర్తి, మాలతి, జయశ్రీ, విజయ్ కుమారి, స్టాఫ్ సెక్రటరీ నాగయ్య, బలరాం, ఉప్పలయ్య, రవి, సంజీవ్, వకుల, భవాని పాల్గొన్నారు.

సీఐ రాజును కలిసిన నాయకులు



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

స్టేషన్‌ఘనపూర్ సీఐ ముస్కు రాజును సోమవారం వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు బోసు ఐలయ్య ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులతో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు బొమ్మిశెట్టి రాజు, ఓర్సు పాపయ్య, శివరాత్రి స్వామి, నాయకులు బోసు శివ, కస్తూరి రవి, సమ్మయ్య, రమేష్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి పట్టాలిచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

నవతెలంగాణ-జనగామ

పసురమట్ల గ్రామకంట్ల భూమిలో గుడిసెలు వేసుకున్న ప్రతిఒక్కరికి పట్టాలు ఇచ్చి ఇల్లునిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకుకనుకారెడ్డి డిమాండ్ చేశారు. జనగామ మండలం పసరమాడ్ల గ్రామంలోని గ్రామాకాంట్టమ్ భూమిలో ఇండ్లు లేని సుమారు 200మంది గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీపీఎం జనగామ మండల కార్యదర్శి బోడ నరేందర్ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి పాల్గొని మాట్లాడారు. గత పది సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టిస్తా అని చెప్పి ఏ ఒక్కరికి కూడా ఇవ్వనటువంటి పరిస్థితి ఉందన్నారు. ప్రజలఓట్లతో గెలిచి ప్రజలనుపట్టించుకోవడం మరిచిపోతున్నారు. ప్రజాసమస్యలను పట్టించుకోని టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు అలాగైతే గద్దెదించారో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి కూడా తొందర్లోనే ప్రజలు మోడీని దించే రోజులొచ్చాయన్నారు. ప్రవేట్,కార్పొరేట్ విధానాలను అనుసరించి ప్రభుత్వరంగా సంస్థలు అన్ని కార్పొరేట్ వేత్తలకు కట్టపెడుతూ బ్రజాధనమంతా ఆదాని, అంబానీలకు కట్టపెడుతూ ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెపాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలల్లో భాగంగా ఇండ్లు లేని పేదలందరికి ఇంటి స్థలం ఇచ్చి ఇండ్లు కట్టించి ఇవాలన్నారు. అందులో భాగంగానే సీపీఎం ఆధ్వర్యంలో పసరమాడ్ల గ్రామంల్లో ప్రభుత్వ గ్రామాకాంట్టం భూమిల్లో 200 మందితో గుడిసెలు వేయించమన్నారు.



ఈ గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి పట్టాలు ఇచ్చి ప్రభుత్వం ప్రకటించిన గృహాలక్ష్మి పథకం క్రింద రూ. 5 లక్షలు ఇచ్చి ఇండ్లు కంటించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. అనంతరం గుడిసెవాసులతో కలిసి కలెక్టర్ ఏవో రవీందర్‌కి మెమోరాండం అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పోత్కానూరి ఉపేందర్, నాయకులు రామావత్ మీట్య నాయక్, బేజారబోయిన మల్లేష్, ప్రసాద్, యాదగిరి, గుడిసెవాసుల నాయకులు గుడిసెవాసులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి : కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమమని, అర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. కొడకండ్ల మండలంఏడునూతల గ్రామంలో బయన్నవాగు రిజర్వాయర్ నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులు 70 ఎకరాలకు సంబంధించి నష్టపరిహారం చెల్లించాలని దరఖాస్తు చేశారు. జనగామ మండలానికి చెందిన మొగుళ్ల ఆదిరెడ్డి రెవెన్యూ శాఖకు సంబంధించి వ్యవసాయ భూమి నుంచి ప్లాట్లుగా భూమి కన్వర్షన్ జరిగింది కానీ పట్టేదారు పాస్ పుస్తకం నుంచి ప్లాట్లను తొలగింపులకు దరఖాస్తు చేసుకున్నారు. పాలకుర్తి మండలం విశ్నూరు గ్రామానికి చెందిన కృష్ణ తనవారసత్వ భూమి గురించి ధరణి బుక్ ఇప్పించుట కొరకు స్టేషన్ ఘున్పూర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. రఘునాథపల్లి మండలం అశ్వారావుపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగే సాంబశివారెడ్డి తన భూమిని తమ పేరుపై రికార్డులను నమోదు చేసి పట్టా పాస్ పుస్తకంలో నమోదు చేయాలని కోరారు. బచ్చన్నపేట మండలం బండనాగారం గ్రామానికి చెందిన మానపల్లి మల్లయ్య పట్టాదారు పాస్ పుస్తకంలో భూమి పట్టా చేసేందుకు తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, జనగామ ఆర్డీవో కొమురయ్య, స్టేషన్‌ఘన్పూర్ ఆర్డీవో వెంకన్న, డిఆర్డిఓ మొగులప్ప, జడ్పీ సీఈఓ అనిల్ కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ ఈ-కేవైసీ అప్డేట్ చేసుకోవాలి...

మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీ వినియోగదారులు ఈ-కేవైసీని అప్డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎంపీడీవో, మున్సిపాలిటీలో, అన్ని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఆధార్ కార్డుతో గ్యాస్ సబ్సిడీకి లింకు చేసుకోవాలని చెప్పారు. అలాగే ముఖ్యమంత్రి ప్రజా దర్బార్ పెండింగ్ దరఖాస్తులను ఈనెల 14 లోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల సమస్యల పరిష్కారానికి అధికారులంతా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ఈనెల 12న హైదరాబాదులో నిర్వహించే మహిళా సదస్సుకు జిల్లాలోని మహిళలను తరలించేందుకు మండలానికి రెండు బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఇందిరకే కేటాయించాలి

- కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు చింత జ్యోత్స్న



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

వరంగల్ పార్లమెంటు అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ సింగపురం ఇందిరకు కేటాయించాలని మండల మహిళా కమిటీ ఆధ్వర్యంలో కోరారు. నియోజక వర్గ కేంద్రంలో సోమవారం బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆపార్టీ మండల మహిళా అధ్యక్షురాలు చింత జ్యోత్స్న మాట్లాడుతూ నియోజకవర్గ ఇంచార్జీగా సింగపురం ఇందిర పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నదని, కార్యకర్తల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, మహిళా నాయకురాలిగా ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా అందుబాటులో ఉన్న నాయకురాలని, పార్టీ బలోపేతం చెందాలంటే ఎంపీ టిక్కెట్టు ఇందిరకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నారగోని పద్మ, బత్తిని కవిత, బాస్కుల రజిత, కందుల ఎల్లమ్మ గాదె ఇందిర, చింత సుమలత, వడ్లూరి మౌనిక, ఎండీ సజీదా, బొంత కవిత పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం : కొలిపాక సతీష్



పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన సాగిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొలిపాక సతీష్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అంకురార్పణ చేసిన సందర్భంగా నియోజక వర్గ కేంద్రంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ ప్రజలకు చేసిన వాగ్దానాలను వంద రోజుల్లో అమలు పరచడం జరుగుతుందని, పేదప్రజల మేలుకై ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారెంటీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంద రోజుల్లో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్లు అమలు పరచడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చింత ఎల్లయ్య, సీనియర్ నాయకులు మేకల మల్లేశం, జంపాల శ్రీనివాస్, క్రాంతి, శ్రీకాంత్, ప్రసాద్, జానీ, ఎల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులు ఆర్థికంగా ఎదగాలి



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

పాల ఉత్పత్తిదారులు ఆర్థికంగా ఎదగాలని పాల డైరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ అన్నారు. చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో ముల్కనూర్ సహకార డైరీ సుమారు 192 గ్రామాల్లో 25వేలకుపైగా అత్యధిక సభ్యులతో ముందడుగులో ఉందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా విభాగంలో పాడి రైతులను గుర్తించి ముల్కనూర్ పాల కేంద్రం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ మేరకు చిల్పూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు పోలేపల్లి ప్రేమలత 22746లీటర్ల పాల సేకరణతో ద్వితీయ స్థానంలో నిలిచినందుకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ సహకార సంఘం పాల డైరీ అధ్యక్షురాలు ధనశ్రీ, పాలక మండలి సభ్యులు శోభారాణి, కర్ర రమాదేవి, జమాసాల రాజేశ్వరి, దొంతరబోయిన రజిత, పొన్నం సుజాత, డైరీ సిబ్బంది నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలను వివరించాలి







- ఎస్‌బీఐ బ్యాంకుల ముందు ధర్నా

నవతెలంగాణ-జనగామ

ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే వివరించాలి సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగుప్రకాష్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌బీఐ జనగామ బ్యాంకు ముందు ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణమే వెల్లడించాలని డిమాండ్ చేస్తూ జనగామ సీపీఎం పట్టణ కమిటీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోగు ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ పాటించాల్సిందేనని అన్నారు. మోడీ ప్రభుత్వం ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించకుండా కాలయాపన చేస్తుందని, ఈ విషయంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. తక్షణమే బాండ్ల వివరాలు వెల్లడించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బాల్నె వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం, శాఖ కార్యదర్శిలు మారేడు వినోద్,శిఖిరాల ఉపేందర్, ఎండి మైవెల్లి, కందుల సుధీర్, కుమార్, సుధాకర్, నర్సింలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘనపూర్ : ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే విడుదల చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నానిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొడపాక యాకయ్య మాట్లాడుతూ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడి చేయాలని,మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎలక్ట్రోల్ బాండ్ల వివరాలను వెల్లడించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్బీఐ యాజమాన్యం పాటించాల్సిందేనని సిపిఎం డిమాండ్ చేసింది. ఎస్‌బీఐ యాజమాన్యం సుప్రీంకోర్టు తీర్పు పెడచెవిన పెడుతూ ప్రధాని నరేంద్ర మోడీ మెప్పుకోసం ప్రధాని జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం అయితే బిజెపి పార్టీ, ప్రధాని నరేంద్ర మోడీ అతి పెద్ద అవినీతి బాగోతం బయటపడుతుందని, తద్వారా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇబ్బందులకు గురవుతామని భావించి ఎన్నికల పూర్తి అయ్యేవరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్‌బీఐ చైర్మన్‌ని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దైద రాములమ్మ, చిలుముల భాస్కర్, శాఖ కార్యదర్శిలు పిట్టల నాగేష్, వంగపండ్ల సోమయ్య, తోడంగల ఐలయ్య, గొడిశాల వెంకటేష్, కత్తుల రాజు (సముద్రాల) పార్టీ నాయకులు బొంకూరు రామచంద్ర, సుంచు రాములు, డివైఎఫ్ఐ మండల నాయకులు శాతపురం రవి, లింగనబోయిన శ్రీకాంత్, నీరటి సంపత్, పొలాసు సురేష్, తోడంగల మనీష్, సుంచు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డెస్క్ : సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని సీపీఎం రఘునాథపల్లి మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మహేందర్ మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయకుండా మోడీ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్‌బీఐ చైర్మన్ అరెస్టు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కడారి ఐలయ్య, మైలారం వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్ఎఫ్ఐ మండల సెక్రెటరీ పొదల లవకుమార్, ఆరూరి లక్ష్మయ్య, శంకరయ్య, మల్లయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల మండల ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మండల పాస్టర్ల ఫెలోషిప్ నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని శివునిపల్లిలో సువార్త బాప్టిస్టు చర్చిలో కే సీ జాన్ బన్నీ అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల ఫెలోషిప్ నూతన కమిటీ అధ్యక్షులుగా రెవ పాస్టర్ కందుకూరి దేవదానం, కార్యదర్శిగా రెవ టీ.ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా బీ. సహోదర్, ఎం.టెక్నా, సంయుక్త కార్యదర్శి కనకం జాన్, కోశాధికారిగా కె.ఫిలిప్పు, సహాయ కోశాధికారిగా చార్లెస్, కార్యవర్గ సభ్యులుగా కెయస్. డానియల్, ప్రభురాజ్, సేవక్, రవీందర్, శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రెవ యాకోబు, బాలస్వామి, తిమోతి, కుమార్, అబ్రాహాం బాబు, రత్నం, కొర్నెలు పాల్గొన్నారు.

మహిళలు సాధికారత దిశగా అడుగేయాలి : కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలంటే సాధికారత దిశగా అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.సతీసమేతంగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు పొదుపుతో సాధించిన బ్యాంకు రుణాలను గృహ అవసరాలకు కాకుండా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వివిధ వ్యాపార రంగాల్లో పెట్టుబడులు పెట్టి సాధికారత దిశగా కొనసాగుతూ లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు. విద్యతోనే ఏదైనా సాధించగలమని, వివక్ష ఉన్న పట్టుదలతో సమాజంలో రాణించాలన్నారు. ఆడ, మగ వేదం లేకుండా సమానత్వంతో పిల్లలను చదివించాలని సూచించారు. బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని, ఆడపిల్లలను గర్భంలో చిదిమేసి స్కానింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆడపిల్లలను వేధిస్తే ఫోక్సు చట్టం ప్రకారం శిక్షించడం జరుగుతుందని, వివాహితులను వరకట్నం కోసం వేధిస్తే గృహహింస చట్టం కింద జైలుకు పోవడం ఖాయం అన్నారు. ఆపదలో ఉన్న మహిళలు 181కు కాల్ చేస్తే సఖి కేంద్రం వారు చర్యలు తీసుకుంటారన్నారు. అనాథ పిల్లలకు ప్రభుత్వమే అండగా ఉంటుందని, అందుకు జిల్లాలో రెండు చైల్డ్ హెూమ్స్ ఉన్నాయన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. మహిళా, శిశు సంక్షేమ శాఖలో మహిళల రక్షణకు పలు విభాగాలు చేస్తున్న కృషిని స్కిట్ ద్వారా ప్రదర్శించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు సర్టిఫికెట్స్‌ను కలెక్టర్ అందజేశారు. అదే విధంగా వివిధ శాఖల మహిళా అధికారులను మెమెంటులతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్‌లతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, విశిష్ట అతిథులుగా జిల్లా పరిషత్ చైర్పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, జడ్పీటిసి దీపికా రెడ్డి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి, ఉద్యానవన శాఖ అధికారి లత, పౌరసరఫరా శాఖ అధికారి రోజా రాణి, చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి చౌడేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 3310 మంది హాజరు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలకు సోమవారం జనరల్ విభాగంలో 3396 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 86 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, 3310 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భైరు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 1371 మంది విద్యార్థులకు గాను 1236 మంది పరీక్ష రాసినట్లు 135 మంది గైరాజరైనట్లు పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో మొత్తం కలిపి 4767 మంది విద్యార్థులకు 221 మంది గైరాజరైనట్లు, 4546 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు వివరించారు. నర్మెట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక మాల్ ప్రాక్టీస్ నమోదైనట్లు పేర్కొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ చట్టం ఉల్లంఘిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ (రెవిన్యూ) రోహిత్ సింగ్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఫుడ్ సేఫ్టీ చట్టం ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆహార పదార్థాల తయారీపై ఆధారపడిన వ్యాపార సంస్థలు ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆహార పదార్థాల తయారీదారులు తమ వ్యాపారాన్ని ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా జారీచేసే లైసెన్స్‌తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు చేపడతామని చెప్పారు. అదేవిధంగా ఆయా తయారీదారుల వ్యాపార సంస్థలను మూసివేస్తామని హెచ్చరించారు. ఆహార పదార్థాల తయారీదారులు లైసెన్స్ కోసం ఆన్లైన్లో మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వినియోగదారులు కలెక్టరేట్ 9100105795, ఫోన్ నంబర్ ద్వారా తమ ఫిర్యాదును నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్డిఓ డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-పాలకుర్తి

శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాలతో అంగరంగ వైభవంగా ముగిశాయి. వాహన సేవకులు (పద్మశాలి కులస్తులు) శివపార్వతులు, లక్ష్మీ నరసింహ స్వామిలను పల్లకి సేవతో అగ్ని గుండాల్లో పాల్గొన్నారు. అగ్నిగుండాల్లో ఆలయ అర్చకులు, వాహన సేవకులు, భక్తులు శివనామ స్మరణం చేస్తూ అగ్నిగుండాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సాహ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఉత్సవ కమిటీ ధర్మకర్తలు బోనగిరి సాగర్, పన్నీరు వెంకన్న, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్, మత్తగజం నాగరాజు, వాహన సేవకులు, చిదురాల ఎల్లయ్య, భక్తులు సలేంద్ర సోమన్న పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఇనుగుర్తి

మండలంలోని చిన్ననాగారం గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కురెళ్ళి సతీష్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్, గ్రామాధ్యక్షుడు తుమ్మనపల్లి సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ 20 లక్షల ఎస్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. పనులు సకాలంలో నాణ్యతతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బైరు వెంకటయ్య, బైరు శ్రీనివాస్, కొయ్యండి యాకాంతం, దాసరి ప్రకాష్, గుండ్ల నరసయ్య, బైరు యాదగిరి, చెడుపాక యాకయ్య, గుండ్ల వెంకన్న, ఈశ్వర చారి, మాదగాని ఉప్పలయ్య, భూక్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు పురపాలక సంఘ బడ్జెట్ సమావేశం



నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు పురపాలక సంఘ బడ్జెట్ సమావేశం మంగళవారం సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ శాంతి కుమార్ తెలిపారు. పురపాలక సంఘ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అధ్యక్షతన ఉదయం 9 గంటలకు జరిగే ఈ సమావేశంలో 2024-25 సాధారణ అంచనా బడ్జెట్, 2023-24 సవరణ బడ్జెట్ ఆమోదం కొరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్స్ సభ్యులు, అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలారా ధైర్యంగా ఉండండి

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం మూడు నెలలే అవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని పదేపదే బీజేపీ, బీఆర్ఎస్‌లు చేస్తున్న విష ప్రచారాన్ని ఎక్కడికక్కడ సమర్థవంతంగా తిప్పికొట్టాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, వ్యవస్థలన్నీటిని నిర్వీర్యం చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రోజు నుండి నిరంతరం కృషి చేస్తూ ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తుందని తెలిపారు. లోక్ సభ, స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపాలిటీ, ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా వెంటవెంటనే వస్తాయని, వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని పార్టీ కొన్ని నిర్ణయాలు తీసుకుంటుందని, పార్టీ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ తప్పక గౌరవించి నూతనంగా వచ్చే వారిని పార్టీలో ఉన్నవారు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. నూతన చేరికలు పార్టీని, ప్రభుత్వాన్ని బలోపేతం చేసేందుకే తప్ప పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకుల యొక్క ప్రాధాన్యతను తగ్గించేందుకు కాదని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని కోరారు. ప్రత్యర్థులు కాంగ్రెస్ పట్ల అసత్య ప్రచారాలు చేస్తూ, గందరగోళం సృష్టించడానికి విషం చిమ్ముతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కార్పొరేట్‌కు ధీటుగా లాల్ బహదూర్ స్కూల్

- స్కూల్ కరస్పాంటెండెంట్ జోగు డాంగయ్య



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో లాల్ బహదూర్ పాఠశాలలో పేరెంట్స్ సమావేశం పాఠశాల కరస్పాండెంట్ జోగు డాంగయ్య అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలు శ్రీ వివేకావర్ధిని పాఠశాల కరస్పాండెంట్ చిర్ర ఏకాంతం గౌడ్, గిజుబాయ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ మండల కేంద్రంలో కార్పొరేట్‌కు దీటుగా రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలలకు ఈ పాఠశాల నుండి సీటు సాధించిన విద్యార్థులున్నారని, నవోదయలో కూడా విద్యార్థులు చదివి దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని, ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో సాంకేతిక రంగంలో ప్లేవే పద్ధతిలో భోదన జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మండలంలోని మంచి బేసిక్స్ ఉన్న పాఠశాల ఏది అంటే అది ఉప్పరపల్లి గ్రామంలో ఉన్న లాల్ బహదూర్ పాఠశాల అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు శారద సరిత, స్పందన, కల్పన, సౌమ్య, జ్యోతి, శాంత ఉపాధ్యాయులు పిల్లలతో సంస్కృతిక కార్యక్రమాలు ఆటలు పాటలు నిర్వహించారు. వీరితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు అల్లి రమేష్, ఏర్పుల కుమారస్వామి, ఏర్పుల మహేందర్, బండారు రాజు, ఆవుల రాజు, మంచాల కుమార్, ఎసల్ల అనిల్ కుమార్, మెండే శరత్ చంద్ర, సోమ రవి, ఎసల్ల సత్యనారాయణ, లింగస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తను అన్ని విధాలుగా ఆదుకుంటాం



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

కాంగ్రెస్ కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ అన్నారు. మండలంలోని చింతలపల్లి గ్రామ కాంగ్రెస్ బూత్ కన్వీనర్ బలగాని మహేష్ అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పెదగాని సోమయ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడుఅశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఎడ్ల వెంకటరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ దుష్ప్రచారం మానుకోవాలి

- కాంగ్రెస్ మండలాధ్యక్షులు సుంచు సంతోష్



నవతెలంగాణ-తొర్రూరు

సాగునీటి విడుదలపై బీఆర్ఎస్ నాయకుల విమర్శలుఅర్థరహితమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. సాగునీటి విడుదలపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ వ్యవసాయానికి చివరి ఆయకట్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం సాగునీరు అందిస్తుందని, దీనిలో ఎలాంటి అపోహలకు తావు లేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీరు అందించేందుకు ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారని తెలిపారు. రాష్ట్ర ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి సాగునీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కోరినట్లు తెలిపారు. రైతులు వేసుకున్న పంటలు ఎండిపోకుండా రెండు రోజుల్లో నీరు అందించేందుకు ఎంఎల్ఏ తగిన చర్యలు తీసుకుంటున్నారని, రైతులకు నష్టం వాటిల్లకుండా అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. రైతాంగాన్ని మోసగించారు కాబట్టే బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లోను వారికి భంగపాటు తప్పదని స్పష్టం చేశారు. నియోజకవర్గ రైతాంగ సమస్యలపై ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, పార్టీ ఇన్చార్జి అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిలు అహర్నిశలు పాటు పడుతున్నారని, ప్రజలు ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టాలని కోరారు.

హైమాక్స్ లైట్లు ప్రారంభం

నవతెలంగాణ-పాలకుర్తి

తండాలలో వెలుతురు నింపాలనే లక్ష్యంతో హైమాక్స్ లైట్లు ప్రారంభించామని ఎంపీపీ నల్ల నాగిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్ద తండా బి గ్రామ పంచాయతీలో రెండు లక్షల వ్యయంతో జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండి మదర్ నిధులు కేటాయించడంతో హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దతండా బి పంచాయతీ మాజీ సర్పంచ్ లావుడియా మోజీ బాలునాయక్, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండిమదర్‌తో కలిసి ఎంపీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ తండాలలో హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడం పట్ల తండావాసులు మదార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బానోతు చత్రునాయక్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లావుడియా దేవా నాయక్, లాయుడియా శాంతి, గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్, భీమా నాయక్, లకావత్ బాలు, జలగం నగేష్, లకావత్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగరలో బీఆర్ఎస్‌కు భారీ షాక్..!

- పార్టీకి ఆరుగురు ఎంపీటీసీల మూకుమ్మడి రాజీనామా
- ఎంపీపీపై అసంతృప్తితో పార్టీని వీడుతున్నట్లు ప్రకటన
- ఈ నెల 23న అవిశ్వాస బలనిరూపణ
- త్వరలో ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరడం ఖాయమా..?



నవతెలంగాణ-పెద్దవంగర

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి పెద్దవంగర మండలంలో భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీతో సహా తమ పార్టీ సభ్యత్వాలకు సోమవారం రాజీనామా చేశారు. కాగా వీరందరు ఇటీవల ఎంపీపీపై అవిశ్వాసానికి ప్రతిపాదించిన విషయం తెలిసిందే. రాజీనామా చేసిన ఆరుగురు ఎంపీటీసీ సభ్యుల్లో వైస్ ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పన (అవుతాపురం), బానోత్ విజయ (పోచంపల్లి), ఈరెంటి అనురాధ (గంట్లకుంట), ఎర్ర సబిత (కొరిపల్లి), బానోత్ రవీందర్ నాయక్ (బొమ్మకల్లు), మెట్టు సౌజన్య (చిన్నవంగర) ఉన్నారు. రాజీనామా చేసిన ఎంపీటీసీ సభ్యులు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎంపీపీపై అసంతృప్తితోనే పార్టీని వీడుతున్నాం...

బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఎంపీటీసీలు మాట్లాడుతూ ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, ఆమె భర్త బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఈదురు ఐలయ్యలపై అసంతృప్తితోనే పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఐలయ్య రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అండదండలతో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ.. ఎంపీటీసీ సభ్యులను బెదిరిస్తూ, అవమానపరిచారన్నారు. ప్రతి గ్రామంలో రెండు గ్రూపులను సృష్టించి, ఆర్థికంగా మానసికంగా తోటి ఎంపీటీసీ సభ్యులను నష్టపరిచినందుకు తీవ్ర మనస్థాపానికి గురై పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఐలయ్య తానే ఎంపీపీగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. తోటిఎంపీటీ సభ్యులకు గౌరవం ఇవ్వకుండా, తానేరాజు, తానేమంత్రి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను వీడిన ఎంపీటీసీలు త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్న ఎంపీటీసీలు...

బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. వీరంతా ఈనెల 5న ఎంపీపీపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో మండలంలో ఎంపీపీ పై అవిశ్వాస పరీక్ష ఎదుర్కొవాల్సి ఉంది. కాగా ఎంపీటీసీ సభ్యులు పక్కాస్కెచ్‌తో ఉన్నట్లు సమాచారం. ముందుగా ఎంపీపీని పదవిలో నుండి దింపి, కాంగ్రెస్‌లో చేరడం దాదాపుగా ఖాయంగా కనిపిస్తోంది. ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ నియోజకవర్గ పెద్దల డైరెక్షన్‌లోనే నడుస్తున్నట్లు సమాచారం. కాగా వీరంతా ప్రస్తుతం అవిశ్వాసం బలనిరూపణ కోసం క్యాంపు తరలివెళ్లారు.

ఎంపీపీ పై అవిశ్వాసం నెగ్గడం ఖాయమా..?

మరో ఆరు నెలల్లో ఎంపీపీ పదవీ కాలం ముగుస్తుండగా ఎంపీపీ పై అవిశ్వాస ఎత్తుగడ మండల వ్యాప్తంగా రాజకీయ చర్చకు తెరలేపింది. కాగా మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలకు గాను బీఆర్ఎస్ 7, కాంగ్రెస్ 1, ఇతరులు 1 స్థానం దక్కించుకున్నారు. వీరిలో చిన్నవంగర ఎంపీటీసీ సభ్యులు మెట్టు సౌజన్య కాంగ్రెస్ వీడి, ఎమ్మెల్యే ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల పెద్దవంగ ఎంపీటీసీ సభ్యులు ఏదునూరి శ్రీనివాస్ వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. మిగిలిన 8 మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఎంపీపీ కాక ఆరుగురు ఎంపీటీసీలు బొమ్మెరబోయిన కల్పన (అవుతాపురం), బానోత్ విజయ (పోచంపల్లి), ఈరెంటి అనురాధ (గంట్లకుంట), ఎర్ర సబిత (కొరిపల్లి), బానోత్ రవీందర్ నాయక్ (బొమ్మకల్లు), మెట్టు సౌజన్య (చిన్నవంగర) ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారు. వడ్డెకొత్తపల్లి ఎంపీటీసీ సభ్యులు సాయిని ఝాన్సీ అవిశ్వాస తీర్మానానికి దూరంగా ఉన్నారు. కాగా ఎంపీపీ ఈ నెల 23న అవిశ్వాస పరీక్ష ఎదుర్కొవాల్సి ఉంది. 8 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు అంటే 5 మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతు తెలిపితే ఎంపీపీ తన పదవి కోల్పోతుంది. ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసానికి ప్రతిపాదించారు. దీంతో మండలంలో ఎంపీటీసీల ఎపిసోడ్ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఆ ముగ్గురిని కాంగ్రెస్‌లోకి రానివ్వద్దు..!

- ఊకల్ గ్రామస్తుల ఆందోళన



నవతెలంగాణ-మరిపెడ

బీఆర్ఎస్‌లో ఉండి పది సంవత్సరాలపాటు అధికారాన్ని సంకలో పెట్టుకొని, ఒకరు మంత్రి వేనకాల, మరొకరు ఎమ్మెల్యే వెనకాల, మరొకరు కాంట్రాక్టర్ పనులు చేసుకుంటూ ఉన్నవారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వారంతా కాంగ్రెస్‌లోకి రావాలని చేస్తున్న ప్రయత్నాలను ఊసరవెల్లి రాజకీయాలకు స్వస్తి పలకాలని, ద్వంద్వ నీతి రాజకీయాలను విరమించుకోవాలని మండలంలోని తాళ్లవుకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చాపల యాదగిరి రెడ్డి, కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మరో కాంట్రాక్టర్ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి కోట్ల రూపాయలు సంపాదించుకోవడమే వారి పనీ అని తాళ్ళవకల్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల నరేష్, కె రమేష్, సీమ సురేష్, బి.నరేందర్, మట్టి మురళి ఆరోపించారు. ఉన్న వారంతా అధికార బీఆర్ఎస్ పార్టీలో ఉండి కాంగ్రెస్ కార్యకర్తలను ముప్పు తిప్పలు పెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రామచంద్రనాయక్ గెలిపించుకోవడానికి మేము ఆర్థికంగా నష్టపోయి, కుటుంబ సమస్యలతో ఇబ్బందులు పడ్డామని, కాంగ్రెస్ కోసం త్యాగానికి సిద్ధపడ్డామని వారు పేర్కొన్నారు. ఒకానొక దశలో రామచంద్రనాయక్‌ను ఓడించటానికి ఉకల్ గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు విస్తృత ప్రచారం చేశారని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్‌లో ఉన్న నాయకులంతా మళ్లీ కాంగ్రెస్లో చేరి ఊసరవెల్లి రాజకీయాలకు వడిగాడుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు వాపోయారు.

ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే గమనించి ఆ ముగ్గురు వ్యక్తులను కాంగ్రెస్‌లోకి రానివ్వకుండా అడ్డుకోవాలని కోరారు. అవసరమైతే గాంధీభవనం ముందట ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.శ్రీనివాస్, తప్పెట్ల అనురాధ ఉపేందర్, ఇరుగు రవీందర్, నందారపు మధు, కన్న గణేష్, భూక్య శ్రీను, డి.గంగయ్య, ఎం.వేణు, మల్లేష్, వెంకన్న, లింగయ్య శ్రీను, శ్రీశైలం, శంకరన్న తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు పెట్టే విధానం విరమించుకోవాలి

- మరిపెడ ప్రాజెక్టు నాయకురాలు బి.పుష్ప



నవతెలంగాణ-మరిపెడ

అంగన్వాడీలకు కనీస వేతనం ప్రకటించకుండా సీసీ కెమెరాలు పెట్టి పని భారం పెంచడం సరైందికాదని, సీసీ కెమెరాలు పెట్టే విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ ఎల్పర్స్ యూనియన్ (సిఐటియు)మరిపెడ ప్రాజెక్టు నాయకురాలు భాషిపంగు పుష్ప అన్నారు. సోమవారం మరిపెడ పట్టణ కేంద్రంలోని ఐసిడిఎస్ సిడిపిఓ శిరీషకు వారు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం పుష్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలతో ఇచ్చిన విధంగానే సెలవులు వర్తింపచేయాలని, మే నెల అంతా సెలవు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన మొబైల్ ఫోన్‌లో ఆన్లైన్ సర్వేలుచేయలేకపోతున్నామని, వాటి స్థానంలో కొత్త మొబైల్‌లు అందించాలని కోరారు. లేనియెడల పాత మొబైల్ ఫోన్లను ప్రభుత్వానికి వాపసిస్తామన్నారు. తదితర సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 12న కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకురాలు గుమ్మడి కళవతి, దోమల శ్రీలత, ఎం.ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

జీఓ 3కి చట్ట భద్రత కల్పించాలి : రామారావు



నవతెలంగాణ-బయ్యారం

జీవో నెంబర్ 3కి చట్టభద్రత కల్పించాలని టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు అన్నారు. సోమవారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల రంగాపురం నందు టిటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు అజ్మీర రూప్లా నాయక్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జీఓ నెంబర్ 3 ప్రకారం డీఎస్సీ-2024 ద్వారా ఏజన్సీ ప్రాంతాల్లోనీ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు, పదోన్నతులు, బదిలీలు ఆదివాసీ, గిరిజనులతో చేపట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఎమ్మెల్యేలతో టిఏసి తీర్మానం చేసి శాసన సభ ఆమోదం ద్వారా ఆర్డినెన్సు తెచ్చి ఏజన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ, గిరిజన నిరుద్యోగులతో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రితో జరిగిన సమీక్షలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు అజ్మీరా బాబురావు నాయక్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా బన్సీలాల్ నాయక్, మండల అధ్యక్షులు బి.లింగ్యా నాయక్, మండల ప్రధాన కార్యదర్శి మహిళల నాయక్, ఉపాధ్యాయ సంఘ నాయకులు బి.రంగన్న, రామారావు నాయక్, కె.నరసింగరావు, ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య



నవతెలంగాణ-తొర్రూరు

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు పట్టణ కేంద్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుంచు సంతోష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు గత ఐదు నెలల నుండి ఏడు నెలల వరకు వేతనాలు పెండింగులో ఉన్నాయని, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, రాష్ట్రంలో మల్టీపర్పస్ వర్కర్ విధానంతో ఉద్యోగ భద్రత కోల్పోయారని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 9,500 వేతనాలు కూడా అందరికీ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఐదు నుండి ఏడునెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 51 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌లకు పంచాయతీ సహాయ కార్యదర్శిలుగా నియమించాలని, అందరినీ పర్మినెంట్ చేయాలని, ఆలోపు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. మరణించిన కార్మికులకు ఐదు లక్షల ఇన్సూరెన్స్ అమలు కోసం విధివిధానాలను ఖరారు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని, ఆదివారం పండుగ సెలవులు అమలు చేయాలని, చనిపోయిన కార్మికుల దహన సంస్కారాలు నిర్వహించేందు కు ఖర్చుల నిమిత్తం 20 వేల రూపాయలు చెల్లింపులు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జమ్ముల శ్రీను, బత్తిని వెంకన్న, జనగాం జిల్లా అధ్యక్షులు బత్తిని వెంకన్న, వరంగల్ జిల్లా అధ్యక్షులు గూడెల్లి ఉప్పలయ్య, బసవ రామచందర్, జిల్లా ఉపాధ్యక్షులు రామచందర్, కొమ్ము దేవేందర్ మున్సిపల్ నాయకులు బానోతు లక్ష్మణ్, గార ఉపేందర్, కార్యదర్శి సోమారపు వెంకన్న, యాదగిరి సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

మృత్యుంజయ రాజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుర్తురు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు పరీక్షా సామాగ్రి, సుమారు పదివేల రూపాయల విలువ చేసే బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం భాస్కరాచారి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు చదువుకునే వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు సంస్థ తరపున పంపిణీ చేయడం సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మేడే సాయికిరణ్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు ఇంటింటా సర్వే



నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు డివిజన్ పరిధిలో కుష్టి వ్యాధి నివారణపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు డివిజనల్ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనకర్ రెడ్డి తెలిపారు. సోమవారం తొర్రూరు పట్టణంలో సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 77 వేల 394 కుటుంబాలు ఉండగా సర్వే కొరకై 270 బృందాలు, 25 మంది సూపర్వైజర్‌లను ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలో మొత్తం 40 మంది వ్యాధిగ్రస్తులు మందులు వాడుతున్నారని తెలిపారు. శరీరంపై గోదుమ, ఎరుపు, రాగి వర్ణం కలిగిన మొద్దు బారిన స్పర్శలేని మచ్చలు రావడం జరుగుతుందని, ఒకరి నుండి ఇంకొకరికి గాలి ద్వారా వ్యాప్తి జరుగుతుందని, ప్రాథమిక దశలో గుర్తించి సకాలంలో మందులు వాడితే నూరు శాతం నివారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. వ్యాధిసోకిన 3 నుండి 8 సంవత్సరాల తరువాత లక్షణాలు కనిపిస్తాయని, చికిత్స అందకపోవడంతో అంగవైకల్యం కూడ ఏర్పడుతుందని, ప్రభుత్వం12 నెలలకు మందులు ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అందచేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ విజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన బొమ్మగాని ఆదిత్య కుటుంబానికి వారి సోదరుడు బొమ్మగాని మనోజ్‌కి ఆర్థిక సహాయంగా సోమవారం ఒక క్వింటా బియ్యం అందజేసినట్లు పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాష, బండారి వెంకన్న గౌడ్, దంతాలపల్లి రవి, మాలే మోహన్ రావు, జంజిరాల మనోహర్, బొమ్మనబోయిన కుమార్, నల్లపు రాజు, చీకటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-గార్ల

మండలంలోని చిన్న కిష్టాపురం గ్రామం ఎస్టీ కాలనీలో అనేక మంది ప్రజలు విష జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈప్రాంతంలో ఉన్న మంగలి తండా, పెద్దకిష్టాపురం గ్రామాల్లో కూడా జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైద్య అధికారులు స్పందించి తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరారు.



ఘనంగా గంగమ్మ భవాని తల్లి విగ్ర ప్రతిష్ఠ

నవతెలంగాణ-మరిపెడ

మండలంలోని పురుషోత్తమయగూడెం గ్రామంలో గంగమ్మతల్లి విగ్రహప్రతిష్టా కార్యక్రమం సోమవారం ఘనంగా వేదపండితుల సాక్షిగా జరిగింది. ఆకేరు వాగుపక్కన నూతనంగా గంగమ్మతల్లి దేవాలయాన్ని నూకల నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్, డాక్టర్ రామచంద్రునాయక్, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి, నూకల నరేష్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నూకల అభినవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజతో పాటు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మాట్లాడుతూ ఆకేరు వాగు పక్కన గంగాభవాని విగ్ర ప్రతిష్ఠ చేయడం ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిదే విధంగాఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి, మండలాధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కోటా వెంకట్ రెడ్డి, చౌడారపు మోహన్ రావు, మాజీ ఎంపిటిసి గంధసిరి అంబరీష, మాజీ ఒడిసీఎంహెచ్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, మరిపెడ మాజీ సర్పంచ్ పానుగోత్ రామ్ లాల్, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు అఫ్జల్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన (ఐపీఎస్) ఎస్‌హెచ్ఓ



నవతెలంగాణ-బయ్యారం

తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా మండలంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ట్రైనీ ఐపీఎస్ ఎస్‌హెచ్ఓ చేతన్, సీఐ రవికుమార్ సందర్శించారు. సోమవారం మండలంలోని ఉప్పలపాడు, లక్ష్మీనరసాపురం, బాలాజీపేట, మొట్ల తిమ్మాపురం పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు.

వేతనం ఇప్పించండి..

నవతెలంగాణ-మరిపెడ

మండల పరిషత్ పరిధిలో బోరింగ్ చేతి పంపు మెకానిక్‌గా బిచ్చు నాయక్ 32 ఏళ్లుగా మండలంలోని అన్ని గ్రామాల్లో చేతిపంపులు రిపేర్ చేస్తు నారు. ప్రతినెల అతనికి 13వేల పారితోషికం మూడు గ్రామ పంచాయతీలకు ఒక్కొక్క గ్రామపంచాయతీ 4300 చొప్పున ఇతనికి జీవనభృతి కల్పించడం జరుగుతుంది. ఈ క్రమంలో గత ప్రభుత్వంలో 2 నెలలు.. కొత్త ప్రభుత్వంలో మూడు నెలలు మొత్తం కలిపి ఐదు నెలలుగా జీతం రావాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎప్పటికైనా నాకు రావలసిన ఐదు నెలల వేతనం ఇప్పించాలని బిచ్చు నాయక్ కోరారు.



అంబటిపెల్లి గ్రామ యాదవ సంఘం ఎన్నిక



నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని అంబటిపెల్లి గ్రామంలో ఆదివారం రాత్రి అఖిలభారత యాదవ సంఘం మహాసభగ్రామ శాఖను మండల నాయకులు కాటమైనా రాజయ్య యాదవ్, కాత్రేవుల నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కాత్రేవుల సమ్మయ్య యాదవ్, ముల్కల రాయ మల్లు యాదవ్, అధ్యక్షులుగా కాత్రేవుల మల్లేష్ యాదవ్, దుంద్ర ప్రవీణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అనముల శంకర్ యాదవ్, కోశాధికారిగా దుంద్రా రాజుయాదవ్, సహాయ కార్యదర్శిగా సింగినేనిమల్లేష్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా కాత్రేవుల శ్రీశైలంయాదవ్, కళ్యాణ్ యాదవ్, ఆదిరెడ్డి యాదవ్, పూర్ణచందర్ యాదవ్, బీనమైన కొమరయ్య, ముల్కల రాములు, వీరమల్లు యాదవ్, చిన్న వీరమల్లు యాదవ్, కాత్రేవుల కతరసాల యాదవ్ సింగనవేనా కత్రసాల యాదవ్, ములకల స్వామి యాదవ్, ములకల రవి యాదవ్ ములకల రాజేష్ యాదవ్, సింగనవీన రాజు యాదవ్.తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపం చెంది గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రేగొండ

మనస్తాపం చెంది పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కనపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎస్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కనపర్తి గ్రామానికి చెందిన మునిగాల సంతోష్(48)కు రెండు నెలల కిందట యాక్సిడెంట్ అయింది. దీనికి తోడు వ్యవసాయ పనుల నిమిత్తం చేసిన అప్పు భారం తోడైంది. అప్పు ఎలా తీర్చాలో మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో శనివారం మద్యం సేవించి ఇంటికి రాగా అతని భార్య ఎందుకు మద్యం తాగుతున్నావని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన అదే రోజు అతని వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ రవికుమార్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి సీతక్క

నవతెలంగాణ -తాడ్వాయి

కాంగ్రెస పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ దనసరి సీతక్క అన్నారు. సోమవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మొదట కాటాపూర్‌లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు పులి నరసయ్యగౌడ్ ఆధ్వర్యంలో గీత కార్మికులు మంత్రి సీతక్కను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ములుగు జిల్లా అభివద్ధికి కషి చేస్తామన్నారు. 6 గ్యారంటీల్లో భాగంగా భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్లను ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు గ్యారెంటీలు అమలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్, మేడారం ట్రస్ట్ బోర్డ్



ఉత్సవ కమిటీ చైర్మన్ అరెం లచ్చు పటేల్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి, తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, తెలంగాణ కలుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు పులి నరసయ్య గౌడ్, సీనియర్ నాయకులు బెల్లంకొండ రోశయ్య, మద్దూర్ రాములు, కార్మిక సంఘం నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను జిల్లా అదనపు కలెక్టర్ కె, వెంకటేశ్వర్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 15 వినతులు రాగ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల ను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను అరికట్టొచ్చు : సీడీపీఓ అవంతి

నవతెలంగాణ-చిట్యాల

చిరుధాన్యాల వాడకంతో పిల్లలు, గర్భిణుల్లో రక్తహీనతను అరికట్టొచ్చని సీడీపీఓ అవంతి అన్నారు. సోమవారం మండలంలోని కాల్వపెల్లి తండాలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీటీసీ విజయలక్ష్మితో కలిసి సీడీపీఓ అవంతి పాల్గొని మాట్లాడారు. మార్చి 9వ నుండి 23వ తేదీ వరకు పోషణ్ పక్వాడ కార్యక్రమం ఉంటుందన్నారు. 3-6ఏండ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అన్నారు. అనంతరం గర్భిణికి సీమంతం, నలుగురు పిల్లలకు అక్షరాభ్యాసం చేసారు. ఫ్రీ స్కూల్ మెటీరియల్‌తో స్టాల్ ఏర్పాటు చేసి తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జయప్రద, సూపర్వైజర్, జ్యోతి, ఫర్జానా, విజయ, తిరుమల పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-గణపురం

మండలం లోని లక్ష్మారెడ్డిపల్లిలో శ్రీ రామలింగేశ్వర దేవాలయం వద్ద భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ ఒద్దుల విజయ అశోక్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. లక్ష్మారెడ్డిపల్లికి రూ. 30లక్షలతో 5 సీసీ రోడ్లు, మేకల మండికి రూ. 20లక్షలతో కాంపౌండ్‌కు నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామ అభివద్ధికి తోడ్పాటుఅందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపా ధ్యక్షులు మామిడాల విజయ్‌కుమార్, గుడి ఇన్‌చార్జి రెడ్డి రాజీ రెడ్డి, వీరమల్ల వీరారెడ్డి, పోరెడ్డి మల్లారెడ్డి, సాదు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నతంగా చదివి పరీక్షలో ఉన్నత మార్కులు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి సతీష్‌కుమార్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ మారపల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ కట్ల శంకరయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు తిక్క సంపత్, చిలువేరు ఉదయాకర్, ఉపాధ్యాయులు భరత్ కుమార్, కుమారస్వామి షకీరా బేగం, రాంబాబు, రమేష్, శ్రీనివాస్, స్వామి, దేవేందర్, సదానందం, అంజద్, అనిత, నాయకులు రవికుమార్ పాల్గొన్నారు

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రానికి చెందిన ఎడ్ల రాములు ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి వెనుక నుండి మంటలు చెలరేగాయి. వెంటనే రాములు కుటుంబ సభ్యులు అప్రమత్తమై చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లోని ఫర్నిచర్ ముఖ్యమైన ఎలక్ట్రానిక్ వస్తువులు వంట సామాగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఎడ్ల రాములు విజ్ఞప్తి చేశారు.

సైబర్ సెక్యూరిటీ పట్ల అవగాహన సదస్సు

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

సైబర్ సెక్యూరిటీ, సైబర్ హైజిన్ అంశాలపై సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా, అధికారులకు ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు హాజరై కార్యక్రమాని ప్రారంభించారు. డీజీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అవగాహన ఉండాలని, అపరిచిత లింకులు , సందేశాలకు స్పందించొద్దని అన్నారు. కంపెనీలో సైబర్ సెక్యూరిటీ , సైబర్ హైజిన్ అంశాలను అమలు పరచడం ద్వారా విలువైన సమాచారాన్ని గోప్యంగా ఉంచొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి అజ్మీర తుకారం డీజిఎం(పర్సనల్), ఐటీ మేనేజర్ రజనీకుమారి, జీపీటీసీ మేనేజర్ రామన్ పాఠక్, ఏరియాలోని ఆయా గనుల అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పట్టా కోసం రూ.10వేలు ఇచ్చాం..

- ఎమ్మెల్యే ముందే మొరపెట్టుకున్న లబ్ధిదారులు
- డబ్బులు తీసుకున్న వారిని నిలదీసి కేసులు పెట్టాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నవతెలంగాణ-గణపురం

ఓసి త్రీలో భూములు కోల్పోయిన నగరంపల్లి గ్రామస్తుల కు పునరావాస ప్యాకేజీ కింద రామప్ప కాలనీ సమీపంలో ఇంటి పట్టాలు తీసుకున్న లబ్ధిదారుల వద్ద దళారులు ఒక్కో లబ్ధిదారిని వద్ద రూ.30వేలు తీసుకున్నట్లు లబ్ధిదారులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముందు మొరపెట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే.... 1995లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఐదెకరాల భూమిని కొనుగోలు చేసి 100మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందించారు. భూమిని మాత్రం లబ్ధిదారులకు అందించలేదు దీంతో ప్రభుత్వాలు మారడం తో ఏండ్లు గడిచిపోయింది లబ్ధిదారుల వద్ద ఉన్న పట్టాలు కూడా తడిసి చినిగిపోయాయి. ఎవరి వద్ద పట్టాలు కూడా సక్రమంగా లేవు. దీంతో సింగరేణి ఓసి త్రీ లో భూములు పోతుండగా ఈ ఐదు ఎకరాల భూమి కూడా సింగరేణిలో పోయింది. దీంతో సింగరేణి అధికారులు గ్రామపంచాయతీ తీర్మానంలో ఎవరు పేరు ఉంటే వారికి సింగరేణి నుండి వచ్చే పునరావాస ప్యాకేజీ అందిస్తామని చెప్పారు. దీంతో గ్రామ సర్పంచ్ పట్టాలు తీసుకురావాలని గ్రామంలో డప్పుచాటింపు చేశారు. 100 మందికి గాను 250 మంది దొంగ పట్టాలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి రాగా రెవెన్యూ అధికారులు తలలు పట్టుకోవాల్సి వచ్చింది. వాటిని వడబోసి 83 మందిని ఎంపిక చేశారు. అందులో కూడా 20 మంది లబ్ధిదారుల వరకు బినామీలు ఉన్నట్లు సమాచారం. దీనిని ఆసరా చేసుకున్న కొందరు దళారులు ఒక్కొక్క లబ్ధిదారుల వద్ద రూ.10వేల నుండి రూ.30వేల వరకు డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని స్వ యంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. డబ్బులు ఇచ్చిన వారు చేతులు ఎత్తాలని చెప్పగా 80 శాతం మంది చేతులెత్తారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డబ్బులు ఎవరికి ఇవ్వవద్దని, ఇచ్చిన వారిని నిలదీసి డబ్బులు తీసుకోవాలన్నారు. లేదంటే పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయాలని తెలిపారు. అనంతరం 83మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. మరో 17 మందికి కూడా పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రయాణీకుల కల సాకారం...

- మాట ఇచ్చిన 20 రోజుల్లోనే సీసీ రోడ్డు వేయించిన ఎమ్మెల్యే గండ్ర
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండల కేంద్రంలో గత ప్రభుత్వం బస్టాండ్ నిర్మించి గాలికొదిలేసింది. దీంతో బస్టాండ్ 8ఏండ్లుగా నిరుపయోగంగానే ఉంది. స్థానికులు పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇటీవల భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుండి గండ్ర సత్యనారాయణరావు గెలుపొందారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యల పట్ల మండల స్థాయి నాయకులు కార్యకర్తలు తన దష్టికి తీసుకురావాలలని తెలిపారు. ఇటీవల మేడారం బస్సుల ఓపెనింగ్ కోసం గండ్ర సత్యనారాయణరావు మండల కేంద్రానికి వచ్చినప్పుడు బస్టాండ్ సమస్యలు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే రూ.15 లక్షలు మంజూరు చేసి బస్టాండ్‌కు సీసీ రోడ్డు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం బస్సులు రావాలని డిపో మేనేజర్‌తో మాట్లాడుతానని తెలిపారు. మాట ఇచ్చిన 20 రోజుల్లోనే సీసీ రోడ్డును వేయడం పట్ల ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుట్ల తిరుపతి, మూల శంకర్ గౌడ్ గుర్రం కొమురయ్య టౌన్ అధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ దెబ్బట అనిల్, దొడ్డి కిష్టయ్య బుర్ర శ్రీనివాస్‌గౌడ్, గుమ్మడి సత్యనారాయణ పాల్గొని సీసీ రోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట ఇచ్చిన ప్రకారం గండ్ర సత్యనారాయణ రావు సీసీ రోడ్డు వేయించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు పూర్తి అయిన తర్వాత బస్సులు బస్టాండ్ ప్రాంగణానికి వస్తాయని, అనంతరం బస్టాండ్ కు ప్రహరీ, ప్రయాణికుల సౌకర్యార్థం టాయిలెట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, స్థానిక నాయకులు చిలుకల రాజకుకొమురు, క్యాతం మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందిస్తాం

- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నవతెలంగాణ-భూపాలపల్లి

కేటీకే ఓసీ-3 విస్తరణలో భూములు కోల్పోతున్న గణపురం మండలం, కొండంపల్లి గ్రామ భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందచేస్తామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశపు హాల్‌లో ఓసీ నిర్వాసితులకు పరిహారం అందించే అంశంపై ప్రాజెక్టు మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ భూములకు, ఇంటి స్థలాల కు, వ్యవసాయ భూముల్లో ఉన్న స్ట్రక్చర్స్ కు పరిహారం చెల్లించబడుతుందని చెప్పారు. గ్రామంలో వ్యవసాయ భూములకు, ఇంటి స్థలాలకు ధర నిర్ణయించడానికి చర్చా వేదిక నిర్వహిస్తామని చెప్పారు. అభ్యంతరాలను గ్రామసభల్లో లిఖిత పూర్వకంగా అందచేయాలన్నారు. ప్యాకేజీతో పాటు నిర్వాసితులకు ఇంటి స్థలం మంజూరు చేస్తామని చెప్పారు. భూ సేకరణ ప్రక్రియలో దళారులను నమ్మి మోసపోవద్దని, ఏదేని సలహాలు, సూచనలు కోసం తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలను సంప్రదించాలని చెప్పారు. ఒక్క పైసా ఎవరికి ఇవ్వాల్సిన అవసరం లేదని, మోసాలకు గురికావొద్దని ఆయన సూచించారు. భూ నిర్వాసితులకు ధర చెల్లింపుకు కమిటి ఏర్పాటు చేశామని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుండి డేటా తీసుకోవాలని ఆర్డీఓకు సూచించారు. రానున్న 15 రోజుల్లో డిక్లరేషన్ చేస్తామని, నిర్వాసితుల సహకారం, సమన్వయం అవసరమని చెప్పారు. భూమికి తగినట్లు పరిహారం అందచేస్తామని అన్నారు. మే నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్, కమిటి సభ్యులు ఇనగాల పద్మ, ఎడ్ల యాకలక్ష్మి, ఎడ్ల ఓదెమ్మ, క్రాంతికుమార్, ఎంపిడిఓ ఎల్ భాస్కర్, మోతే కరుణాకర్, సుంకరి సుధాకర్ రెడ్డి, సింగరేణి జీఎం బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు సౌకర్యాలు కల్పిస్తాం

గణపురం : సింగరేణి సంస్థ కేటికే ఓసి-3 ప్రాజెక్టు ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇండ్ల నిర్మాణంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. సోమవారం గణపురం మండలం, రామప్పకాలనీలో ఓపెన్ కాస్ట్ భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నగరంపల్లి వాసులు ఓపెన్ కాస్ట్ ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చామని,ఆ మేరకు నేడు ఇంటి స్థలాలు మంజూరు చేసినట్లు చెప్పారు. నగరంపల్లిలో వైద్య కళాశాల, ఆయుష్ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ యూనిట్లు ఏర్పాటు కానున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో వరంగల్, హైదరాబాద్‌లో లభించే వైద్య సేవలు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయని అన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. భూములు కోల్పోయిన నిర్వాసితుల నుండి దరఖాస్తులు స్వీకరించామని, మొత్తం 250 దరఖాస్తులు రాగా క్షేత్రస్థాయిలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిష్పక్షపాతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఎవరైన అర్హులు మిగిలిపోతే తగిన ఆధారాలతో దరఖాస్తు చేస్తే విచారణ నిర్వహించి తగు చర్యలు చేపట్టి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని చెప్పారు. ఇచ్చిన పట్టాల ఆధారంగా లబ్ధిదారులు తక్షణమే భూమి పూజ చేసుకోవాలని, అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. దళారులను ఆశ్రయించి మోస పోవద్దని అన్నారు. సలహాలు, సందేహాల కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా
- అంకిత భావంతో పని చేయాలి
- జిల్లా ఎస్పి కిరణ్ ఖారే

నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్రంలో 65కు పైగా పరిశ్రమల్లో 6వేల ఉద్యోగ అవకాశాలున్నాయని. నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని, వారికి ఉపాధికల్పనే లక్ష్యంగా మెగా జాబ్ మేళాను నిర్వహించామని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. సోమవారం కాటారం మండలం, బీఎల్ఎం గార్డెన్స్ లో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో జిలా కలెక్టర్ మాట్లాడారు. ఇటీవల వైద్యశాఖలో 27 పోస్టులు భర్తీకి చర్యలు చేపడితే దాదాపు 500 మందికి పైగా నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారని అన్నారు. ప్రభుత్వ రంగంలో లిమిటెడ్ పోస్టులు ఉంటాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి మన రాష్ట్రంలో ఉపాధి కొరకు వస్తున్నారని. స్థానిక యువత వరంగల్, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లి ఉపాధి పొందాలని సూచించారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరె మాట్లాడుతూ... మారు మూల ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు మెగా జాబ్ మేళా నిర్వహించడం సంతోషమని చెప్పారు. యువత కెరీర్ ని మంచిగా మలుచుకోవాలని, తద్వారా తల్లిదండ్రులకు, మన జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంజీవరావు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు
- ఎస్బీఐ బ్యాంకు ఎదుట ధర్నా

నవతెలంగాణ-భూపాలపల్లి

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీ శ్రామిక భవన్ నుండి ఎస్బీఐ బ్యాంకు వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఎస్బిఐ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బందు సాయిలు మాట్లాడుతూ.... ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్బిఐ పాటించాల్సిందేనని అన్నారు. మోడీ ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి ఎన్నికలు అయ్యేదాకా ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా ఉండేందుకు ఎస్బిఐ చూస్తుందని ఆరోపించారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెపుతూ ఈ బాండ్లకు సంబంధించిన వివరాలన్నింటిని మార్చి 6లోగా ఎన్నికల కమిషన్ అందజేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో ఎస్బిఐ విఫలమైందన్నారు. ఎస్బిఐకి ఇచ్చిన మూడు వారాల గడువు ముగిసిందని, ఎస్బిఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ బ్యాంకును బీజేపీ బ్యాంకుగా మార్చవద్దని, ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల బాండ్లు మోడీ అతిపెద్ద అవినీతి బాగోతం అని, ఆ బాగోతాన్ని బయటపెట్టేందుకు ఎస్బిఐ ఎందుకు నిరాకరిస్తుందని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల వివరాలు ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలిశెట్టి రాజయ్య వంగాల లక్ష్మక్క, శేఖర్, సురేష్, మహేందర్, రజిని, కిరణ్, శ్రీధర్, రవి, ఉష, స్వాతి, రోజా, జ్ఞానేశ్వరి, పోచమ్మ, లక్ష్మీనారాయణ, కోసర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ వినతి



నవతెలంగాణ-వెంకటాపురం

కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయితీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయితీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ జీ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షులు కట్ల నరసింహచారి మాట్లాడుతూ వేతనాలు లేక కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో 18 గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

గిరిజనుల నుండి స్వీకరించిన వినతి పత్రాలపై శాఖల వారీగా అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలని ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా తెలిపారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాల్‌లో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఐటీడీఏ పీవోతో పాటు శాఖల వారిగా అధికారులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల నుండి వచ్చిన గిరిజనులు వినతి పత్రాలను ఐటీడీఏ పీవోకు అందించారు. వెంకటాపురం మండలం బర్ల గూడెం గ్రామానికి చెందిన కురుస నరసింహమూర్తి గిరివికాసం పథకం కింద కొంత మంది రైతులు బోర్ల మంజూరు కోసం దరఖాస్తు పెట్టుకున్నారనిచ, ఏడాది కావస్తున్నా ఇప్పటికీ మంజూరు కాలేదన్నారు. కన్నాయిగూడెం మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఇరుప కష్ణారావు ఇతర రైతులు కలిసి బోర్లు వేసుకున్నామని విద్యుత్ సరఫరా ఇప్పటివరకు అందించలేదని తెలిపారు. ములుగు మండలం పంచోతుకులపల్లి గ్రామానికి చెందిన మధ్యల విజయ ట్రైబల్ రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఇలా ఆయా గ్రామాల నుండి గిరిజనులు దరఖాస్తులు చేసుకోగా అధికారులు వాటిపై దష్టి పెట్టాలని పీఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు ట్రైబల్ వెల్ఫేర్ డిడి పోచం, ఏవో దామోదర స్వామి, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఎస్ఓ రాజకుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

టీషర్ట్స్ అందజేత

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఈనెల 13, 14, 15 తేదీలలో జరిగే శ్రీ ముయాలమ్మ జాతరకు మండలంలోని పస్రా గ్రామానికి చెందిన మువ్వా రామారావు రూ.25వేల విలువ చేసే టీ షర్టులను జాతర కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. సమ్మక్క మేనకోడలైన ముయ్యాలమ్మ జాతర పస్రా, నాగారం, పాతూరులో ఘనంగా నిర్వహిస్తారు. విధులు నిర్వర్తించే వారికి తన వంతు సహాయంగా టీ షర్టులను అందించినట్టు రామారావు తెలిపారు. అనంతరం రామారావు, ఆయన కుమారుడు భాను ప్రసాద్‌కు జాతర కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి : జీఎస్పీ

నవతెలంగాణ-వెంకటాపురం

గతంలో సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీఓలు మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి స్థలం చుట్టూ రక్షణ దిమ్మలను ఏర్పాటు చేశారని, ఆ దిమ్మలను తొలగించి భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ సోంది వీరయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో రక్షణ దిమ్మలు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఆదివాసి కోయ భాష పుస్తకాలను మంజూరు చేయాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెను సక్రమంగా పాటించాలన్నారు. రాష్ట్ర నాయకులు పునేంసాయి, ములుగు జిల్లా అధ్యక్షులు రేగ గణేష్, ప్రధాన కార్యదర్శి కనితి వెంకటకష్ణ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్, కష్ణ కొమరం భీం కాలనీ ఆదివాసీలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
మంగళవారం | మార్చి 12, 2024 www.navatelangana.com

ఆటోను ఢీకొట్టిన రెడీమిక్స్ లారీ.. పలువురికి గాయాలు

నవతెలంగాణ-రేగొండ

ఆటోను అతివేగంగా వస్తున్న రెడీమిక్స్ లారీ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని రూపిరెడ్డిపల్లి ప్రధాన రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన సురేందర్ తన ఆటోలో మిరపకాయలు ఏరే కూలీలు 12మందిని రోజువారిగా పరకాల నుండి తీసుకెళ్తున్నాడు. రూపిరెడ్డిపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై పరకాల నుండి భూపాలపల్లికి వెళుతున్న రెడీమిక్స్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం అతి వేగం కారణంగా ఆటోను లారీ ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలలో 6గురికి గాయాలయ్యాయి. వారిని పరకాల ఆస్పత్రికి తర లించారు. ఆటో డ్రైవర్(యజమాని) సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆకుల సుభాష్ ముదిరాజ్.

నవతెలంగాణ-గణపురం

మండలంలోని ధర్మ రావు పేట గ్రామానికి చెందిన ఆకుల సుభాష్ ముదిరాజ్‌ను మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోట్లపల్లి సంజీవన్ ముదిరాజ్ సోమవారం తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట గౌరవ అధ్యక్షులు డాక్టర్ జగన్ మోహన్ ముదిరాజ్, కోశాధికారి బూర కరుణాకర్ ముదిరాజ్,కార్యదర్శి నిరటి రాజు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజా దీవెన సభలో.. మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-గోవిందరావుపేట

మణుగూరులో సోమవారం నిర్వహించిన ప్రజా దీవెన సభకు గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా తరలి వెళ్లారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదువేల మంది మహిళలతో మాట్లాడి అనంతరం మణుగూరు పట్టణంలో జరిగిన ప్రజా దీవెన భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్న సందర్భంగా తరలివెళ్లారు. చల్వాయి ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెండం శ్రీకాంత్ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు పులుగుజ్జు వెంకన్న ,జిల్లా నాయకులు వేల్పుగొండ పూర్ణచందర్, మాజీ సర్పంచ్ మేకల సుదర్శన్ ,జిల్లా నాయకులు జాక్కి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సుమారు మండలానికి చెందిన 106మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరు కాగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ రాణిబాయ్ జెడ్పీటీసీ గుడాల అరుణ, తహసీల్దార్ రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపీటీసీలు మంచినీళ్ల దుర్గయ్య, ఆకుతోట సుధాకర్, రేవల్లి మమత, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-చిట్యాల

మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన ఓరుగంటి నిరంజన్ ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మరణించాడు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను గుండెకారి శ్రీనివాస్ రావు పరామర్శించి రూ.15వేల ఆర్థిక సహాయం అందజేసారు.

సింగరేణి ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

సింగరేణి ఆధ్వర్యంలో సింగరేణి ప్రభావిత, పరిసర గ్రామాల నిరుద్యోగ యువతకు సోలార్ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్, కంప్యూటర్ -డిటిపి, ఆర్క్- గ్యాస్ వెల్డింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సెల్ఫోన్ టెక్నీషియన్, టు వీలర్ మెకానిక్, కాస్మోటాలజీ తదితర 38 రకాల కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి శిక్షణ పొందాలనుకునే అభ్యర్థుల వయసు 42ఏండ్ల లోపు ఉండాలని, మార్చి 15 లోపు www.scclmines.com వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని నశ్రీవస్త్రశ్రీ-ఎఱ. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్ల కాపీలను భూపాలపల్లి లో గాని, ఇతర ఏరియాలలో గానీ జీవీటీసీ కార్యాలయాలలో అందజేయాలని అన్నారు. పూర్తి వివరాల కోసం భూపాలపల్లి లోని జీవిటిసి కార్యాలయంలో సంప్రదించాలని జీఎం శ్రీనివాసరావు తెలిపారు.

ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలి : టీయూఎస్

నవతెలంగాణ-మల్హర్‌రావు

మంగళవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమ కారుల సభను, ఉద్యమ కారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని (టియూఎఫ్) తెలంగాణ ఉద్యమకారుల ఫోరం భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని రాజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించడం పట్ల టియూఎఫ్ ఫోరం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 2001 నుండి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అక్రమ కేసులు, బైండోవర్స్ కాకుండా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి గుర్తించాలన్నారు. వారిని ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయిన ఉద్యమ కారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలి

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



మున్నూరు కాపు ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామ్ నగర్‌లో జరిగిన మున్నూరు కాపు సమావేశానికి జిల్లా నాయకులు పెండ్యాల సంపత్ అధ్యక్షత వహించగా దేవయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో మున్నూరు కాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు గత పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న మున్నూరు కాపులు గ్రామస్థాయిలో కౌలు రైతులుగా మిగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపర చడం కోసం విద్యా వైద్యం రంగాలలో అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ములుగు జిల్లాలో సమ్మక్క సారక్క జాతరలో మున్నూరు కాపు సంఘ సత్రం కాళేశ్వరంలో కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మున్నూరు కాపు సంఘ ఆత్మ గౌరవ భవన నిర్మాణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలు ఏకతాటిపై వచ్చి కార్పొరేషన్ సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవి పటేల్, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతంగి సమ్మయ్య, బండి సంజీవ, అశోక్, రవి, దాట్ల శ్రీనివాస్ పిప్పాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యపై దృష్టి సారించాలి : ఏఎన్ఎస్

నవతెలంగాణ-వెంకటాపురం



గిరిజన విద్యపై ప్రత్యేక దష్టి సారించాలని కోరుతూ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏలో జరిగిన గ్రీవెన్స్ డేలో ఐటీడీఏ పీవో సుచిత్ర మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహమూర్తి, ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు మాట్లాడుతూ.. గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అందాల్సిన సంక్షేమ పథకాల అందకుండా పోతున్నాయన్నారు. ప్రాజెక్ట్ కార్యాలయంలో దీర్ఘకాలిక ఉద్యోగులను బదిలీ చేసి కార్యాలయం ప్రక్షాళన చేయాలని కోరారు. ఐటిడిఎ పాలన లో పారదర్శకత పూర్తిగా లోపిం చిందని అన్నారు. సుదీర్ఘ కాలంగా పనిచేసే అధికారులను తక్షణమే ఇక్కడ నుండి బదిలీ చేస్తేనే ఐటీడీఏ పాలన మెరుగు పడుతుంఆదని సూచించారు. సీఎం గిరి వికాస్ పథకం అమలులో అనేక లోపాలున్నాయని తెలిపారు. అడవి బిడ్డలను అన్నదాతలుగా మార్చి వ్యవసాయ రంగం వైపు అడుగులు వేపించి, వారి బతుకులో వెలుగులు తీసుకు రావాలనే దృఢ సంకల్పంతో సీఎం గిరి వికాస్ పథకం తీసుకు రావడం జరిగిందన్నారు. కానీ అధికారుల అవినీతి కారణంగా ఆ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. అధ్యక్షులు ముర్రం రాజేష్, గోపి నాథ్, బాబు, రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత...నలుగురిపై కేసు

నవతెలంగాణ-చిట్యాల



మండలంలోని నవాబుపేట,జడల్ పేట గ్రామ శివారులో నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ డి మల్లేష్ సోమవారం తెలిపారు. నవాబుపేట, జడల్‌పేట గ్రామ శివారు ప్రాంతాలలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్లను తనిఖీచేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేవని తెలిసింది. దీంతో నవాబుపేట,జడల్ పేట గ్రామానికి చెందిన పప్పు శ్రీను, ఒర్ల రవీందర్, అంకం రాజేందర్, నీటూరి లింగరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేపడితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. మండలంలోని చలివాగు, కాల్వపల్లి మానేరు ప్రాంతం నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారు ఎవరైనా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ.500కే నేరుగా గ్యాస్ సిలిండర్ అందించాలి

ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు

నవతెలంగాణ-మల్హర్‌రావు

రూ.500కే లబ్ధిదారులకు నేరుగా గ్యాస్ సిలిండర్ అందజేయాలని ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు యాదవ్ విజ్ఞప్తి చేశారు.సోమవారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న గ్యాస్ సిలెండర్ నేరుగా రూ.500 రూపాయలకు లబ్ధిదారులకు అందించాలని, ముందు మొత్తం పైసలు చెల్లించి గ్యాస్ సిలెండర్ తీసు కుంటే ఆ తర్వాత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో పైసలు జమ చేస్తాము అనే విధానాన్ని ఉపసం హరించుకోవాలన్నారు. బ్యాంకులకు వెళ్లి పైసలు తీసుకోవాలన్నా పట్టణాలకు, మండల కేంద్రాలకు వెళ్ళక తప్పదన్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ప్రయాణాల ఖర్చులకే అయిపోతాయని, తీసుకోవటం ఇవ్వడం కాకుండా మొదటనే రూ.500 తీసుకొని గ్యాస్ సిలెండర్ ఇస్తే గందరగోళం ఉండదని అన్నారు. చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా సబ్సిడీ పైసలు బ్యాంకు ఖాతాలలో జమ చేస్తు న్నామని చెప్పి రెండు మూడు నెలలు జమ చేసి ఆ తరువాత జమ చేయలేదని గుర్తు చేశారు. నేరుగా లబ్ధిదారులకు రూ.500కే గ్యాస్ సిలెండర్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.